# వృద్ధుల వయ వందన పథకం కొనసాగింపు-కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ,మే20(ఆర్ఎన్ఎ): వృద్ధులకు ఆసరగా నిలచేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధానమంత్రి వయ వందన యోజన (పీఎంవీవీవై)ను మరో మూడేండ్ల పాటు కొనసాగించనున్నారు. దీనికి కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఎల్ఐసీ ద్వారా కొనసాగించే ఈ పథకం ఇప్పుడు 2023 వరకు అందుబాటులో ఉంటుంది. 60 ఏండ్లు పైబడి లేదా పదవీ విరమణ అనంతరం ఆదాయం గురించి చింత లేకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. 10 ఏండ్ల కాల పరిమితికి వర్తించే ఈ పథకంలో చేరే వృద్ధులు ఎలాంటి వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం లేదు. పాలసీని కొనుగోలు చేసేందుకు వయసు ధ్రువీకరణ గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు వివరాలు తప్పనిసరిగా పొందుపర్చాల్సి ఉంటుంది. ఒక్కసారి ప్రీమియం చెల్లించి పాలసీని కొనుగోలు చేసే ఈ పథకంలో వడ్డీని 8.3 శాతంగా నిర్ణయించారు. నెలకు రూ.1000 నుంచి రూ.5000 వరకు పెన్షన్ అందుతుంది. అత్యవసర వైద్య సహాయానికి లేదా అరోగ్య సమస్యలకు డబ్బు కావాల్సి వచ్చినప్పుడు ఈ పాలసీని స్వాధీన పరిచి డబ్బు పొందే వీలుకల్పించారు. జీవిత భాగస్వామి అవసరాలకు కూడా ఈ పాలసీ ఉపయోగపడుతుంది.


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 21-5-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 254 | పేజీలు: 8 | వెల: రూ.1/-


## పారాదీప్ తీరానికి 120 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతం

# బెంగాల్ తీరంలో అంఫాన్ తుఫాన్ బీభత్సం

### అల్లకల్లోలంగా సముద్ర తీరప్రాంతం
### భారీగా ఈదురుగాలుతో కూడిన వర్షం
### తూర్పుగోదావరి జిల్లా ఉప్పాడలో ముందుకొచ్చిన సముద్రం

కోల్‌కతా/విశాఖపట్టణం,మే20 (ఆర్ఎన్ఎ): అంఫాన్ తుఫాన్ బెంగాల్ తీరంవైపు వరుగులు పెడుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా, తర్వాత తుఫాన్‌గా, ఆ తర్వాత మహాతుఫాన్‌గా మారి ఉత్తరదిశగా వేగంగా కదులుతున్నది. అంఫాన్‌గా పేరు ఖరారైన ఈ తుఫాన్ ఒడిశా, పశ్చిబెంగాల్ మధ్యలో తీరాన్ని తాకుతుందని భారత వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు.

ప్రస్తుతం తుపాను ఒడిశాలోని పారాదీప్ తీరానికి 120 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది.

వస్తుతం పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా ఒడిశాను ఆనుకుని.. పశ్చిమ బెంగాల్‌వైపు పెనుతుఫాన్ వయునిస్తున్నట్లు వాతావరణశాఖ తెలిపింది. మధ్యాహ్నం లేదా సాయంత్రం పశ్చిమ బెంగాల్‌లోని దిఘా-బంగ్లాదేశ్‌లోని హతియా దీవుల మధ్య సుందర్‌బన్స్‌కు సమీపంలో తుఫాన్ తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో బలమైన ఈదురు గాలులులతో పాటు భారీ వర్షాలు కురవనున్నాయి.

భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలు బెంగాల్, ఒడిషా తీర ప్రాంత జిల్లాల్ని అతలాకుతలం చేస్తున్నాయి. సాయంత్రం 4-6 గంటల సమయంలో దిఘా, హతియా దీవుల వద్ద అంపన్ తీరం దాటే అవకాశముందని వాతావరణశాఖ అంచనావేసింది.

తుపాను నేపథ్యంలో సముద్రంలో 4-5 మీటర్ల ఎత్తులో ఎగిసిపడుతున్న అలలు పశ్చిమ బంగాలోని తీర ప్రాంతాలను ముంచెత్తే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం డైరెక్టర్ జనరల్ మృంత్యుజయ మోహపాత్రా తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు దాదాపు 185 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఒడిశాలో 1.3 లక్షలు, ఒడిశాలో 3 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బంగ్లాదేశ్‌లో 20 లక్షల మందిని పునరావాస శిబిరాలకు తరలించారు. భారత నావికాదళం పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. విపత్కర పరిస్థితుల నుంచి ప్రజలను కాపాడేందుకు సన్నద్ధంగా ఉంది. తుపాను నేపథ్యంలో కోల్‌కతా అంతర్జాతీయ విమానాశ్రయంలో అన్ని కార్యకలాపాల్ని గురువారం సాయంత్రం 5గంటల వరకు రద్దు చేశారు. పశ్చిమబంగాలో ప్రభావిత జిల్లాలను 'రెడ్ ప్లస్ జోన్లు'గా ప్రకటించిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ.. రాష్ట్రంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీస్తున్నారు. రెండు రాష్ట్రాల్లో దాదాపు 40 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాల్ని మోహరించారు. ఆంధ్రప్రదేశ్ తీరంపై అంఫాన్ ప్రభావం బలంగా కనిపిస్తున్నది. తూర్పుగోదావరి జిల్లా ఉప్పాడ సముద్ర తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. ఇక్కడ తీరం అల్ల కల్లోలంగా మారింది. అలాగే తూర్పుగోదావరి జిల్లా అంతర్వేది దగ్గర సముద్రం 50 మీటర్ల ముందుకు చొచ్చుకొచ్చింది. దీంతో మత్స్యకార గ్రామాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. సరుగుడు తోటలు సముద్రపు కోతకు గురయ్యాయి. అలల కల్లోలం వల్ల సముద్రం 20 మీటర్ల మేర ముందుకు వచ్చింది. ఈదురు గాలులకు ఇళ్లు, చెట్లు నేలకొరిగాయి. తీరం కోతకు గురై మరికొన్ని ఇళ్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని వాతావరణ కేంద్రం సూచించింది. కళింగపట్నం, భీమునిపట్నం, విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, వాడరేవు, కృష్ణపట్నంలో మూడో నంబరు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.తెలంగాణపై ఈ తుపాను ప్రభావం ఏమీ ఉండకపోవచ్చునని వాతావరణ విభాగం ఉన్నతాధికారి తెలిపారు.

# గోదావరినీటిని తరలించిన ఘనత సిఎం కేసీఆర్‌ది

### చెరువులను నింపి రెండు పంటలకు నీరందిస్తాం
### -హసన్‌మిరాపూర్‌లో కాలువ పనులు ప్రారంభించిన మంత్రి హరీష్ రావు

సిద్దిపేట,మే20(ఆర్ఎన్ఎ): ప్రజలు, రైతులంతా సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరంతో గోదావరి జలాలను సిద్దిపేట జిల్లాకు తసీఉకుని వచ్చిన గనత సిఎం కెసిఆర్‌దన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వల్లనే ఇది సాధ్యమయ్యిందన్నారు. దుబ్బాక మండలం హసన్ మీరాపూర్ లో కాళేశ్వరం ప్రాజెక్టు 12వ ప్యాకేజీలోని కాలువ నిర్మాణ పనులను దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ వానకాలంలోపే మన ప్రాంత చెరువులు నింపుకొని రైతులు రెండు పంటలు పండించుకోవాలన్నదే సీఎం కేసీఆర్ ఆశయమన్నారు. ఇందుకు అనుగుణంగా స్థానిక సర్పంచ్ లు, ఎంపీటీసీలు, ఇతర ముఖ్యులు ముందుకొచ్చి పనులు వేగవంతం చేసేందుకు సహకరించాలని ప్రజాప్రతినిధులకు మంత్రి పిలుపునిచ్చారు. కాలువ నిర్మాణాలకు రైతులందరూ ఆయా ప్రాంత చెరువులు నింపుకోవాలని, ఈ ప్రాంతానికి నీళ్లు అందించేందుకు సహకరించాలని రైతులను కోరారు. దాదాపు 170 కిలో మీటర్ల ప్రయాణం తర్వాత గోదావరి జలాలు మన దుబ్బాక ప్రాంతానికి వచ్చాయని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి రైతుకు సాయం అందిస్తుందని, చట్ట ప్రకారంగా రావాల్సిన ప్రతి పైసా రైతులకు త్వరితగతిన చెల్లిస్తామని రైతులకు మంత్రి భరోసా ఇచ్చారు. పెద్దగుండవెల్లి కాలువ ప్రధానమైన కాలువతో పాటు హసన్ మీరాపూర్, చింత మడక, అంకంపేట, నారాయణరావుపేట గ్రామాల్లో పారే కాలువ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. హసన్ మీరాపూర్, పెద్ద గుండవెల్లి చౌద చెరువు, దుంపలపల్లి పెద్ద చెరువు, దుబ్బాకలోని నల్ల చెరువు, రామ సముద్రం, ధర్మాజీపేట లోని పెద్ద చెరువు, చిట్టాపూర్ పెద్ద చెరువులను ప్రధానమైన పెద్ద చెరువులన్నీ ఈ కాలువ ద్వారా నిండుతాయని మంత్రి పేర్కొన్నారు. హసన్ మీరాపూర్, పెద్ద గుండవెల్లి, చింత మడక, మాచాపూర్, చెల్లాపూర్, రాజక్కపేట, ముస్తాబాద్ మండలం బదనకల్, మోయిని కుంట గ్రామాల్లోని 13 వేల ఆయకట్టుకు సాగునీరు అందిస్తుందని తెలిపారు. సిద్దిపేట రూరల్, దుబ్బాక, ముస్తాబాద్ మూడు మండలాలు, 8 గ్రామాల్లో ఈ కాలువ ప్రవహిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ ఆనంద్, డీఈ రవీందర్ రెడ్డి, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### మెదక్ జిల్లాకు కాళేశ్వరం నీళ్లు

మెదక్ జిల్లాకు కాళేశ్వరం నీళ్లు మరికొద్ది రోజుల్లోనే రాబోతున్నాయని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మంజీరా నదిపై చెక్ డ్యామ్ నిర్మాణం కల త్వరలోనే నెరవేరనుందన్నారు. కేసీఆర్ రైతుబిడ్డ అయినందునే ఈ కల నేరవేరుతుందని హరీష్‌రావు తెలిపారు. సమైక్య పాలకుల కుట్రల వల్లే మంజీరాపై చెక్ డ్యామ్ నిర్మించడం సాధ్యం కాలేదన్నారు. జిల్లాలోని హవెలి ఘన్‌పూర్ మండలం సర్దన గ్రామంలో మంజీరా నదిపై చెక్ డ్యామ్ నిర్మాణానికి ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ.. ఇవాళ సర్దన వద్ద చెక్ డ్యామ్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ డ్యామ్ ఐదు గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతుందని తెలిపారు. పాపన్నపేటలో మూడు గ్రామాలు, ఘనపురం మండలంలో రెండు గ్రామాల రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మంజీరాపై చెక్ డ్యామ్‌ల నిర్మాణం జరగలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంజీరా నదిపై దాదాపు 15 చెక్‌డ్యామ్‌లు మంజూరు చేయించుకున్నామని మంత్రి గుర్తు చేశారు. సంగారెడ్డి జిల్లాలో ఫసల్వాది గ్రామం నుంచి చివరన సర్దన వరకు ఈ పదిహేను డ్యామ్‌ల నిర్మాణం జరుగుతుందన్నారు. మంజీరా నదిపై చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తే.. ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని హరీష్‌రావు స్పష్టం చేశారు. 25 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామన్నారు. కొండపోచమ్మ సాగర్‌కు నీరు వచ్చిన వెంటనే హల్దీ ద్వారా బొల్లారం మత్తడికి వస్తాయి. అక్కడి నుంచి సర్దన చెక్‌డ్యామ్, కూచనపల్లి చెక్‌డ్యామ్‌కు కాళేశ్వరం నీళ్లు వస్తాయన్నారు. బొల్లారం మత్తడి కింద 13 వేల ఎకరాల ఆయకట్టుకు కాళేశ్వరం నీరు ఇవ్వొచ్చు అని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి తదదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగం పెంచాలి

### నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలి
### అధికారులను ఆదేశించిన సిఎస్ సోమేశ్ కుమార్
### ఔటర్‌పై వాహనాల రాకపోకలకు అనుమతులు

హైదరాబాద్,మే20(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో జాతీయ రహదారులకు సంబంధించిన ముందస్తు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు.రహదారులు నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలని కూడా అధికారులకు సూచించారు. బుధవారం ఈ అంశంపై ఉన్నతస్థాయి కమిటీ సమావేశం నిర్వమించారు. జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి యుటిలిటీ షిఫ్టింగ్, భూసేకరణ, అటవీ అనుమతులు తదితర విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రోడ్ల నిర్మాణానికి సంబంధించి పెండింగ్ సమస్యలను జిల్లాల వారీగా తయారు చేయాలని, జిల్లా కలెక్టర్లతో ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల ప్రాజెక్టులకు సంబంధించిన అటవీ, మెట్రోవాటర్‌బోర్డు, జీహెచ్ఎంసి, ట్రాన్స్‌కో, మిషన్ భగీరథ విభాగాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను కమిటీ చర్చించింది. ఈ సమావేశంలో రవాణా, రోడ్డు, భవనాలశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ, రీజినల్ ఆఫీసర్ రవి ప్రకాశ్, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారి క్రిష్ట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఔటర్ రింగ్‌రోడ్డుపై వాహనాలకు అనుమతి

లాక్‌డౌన్ కారణంగా దాదాపు రెండు నెలలుగా మూతపడ్డ ఔటర్ రింగ్ రోడ్డు తెరుచుకోనుంది. ఇవాళ అర్ధరాత్రి నుంచి ఓఆర్ఆర్‌పై అన్ని వాహనాలను అనుమతించనున్నట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఈ అర్ధరాత్రి నుంచి వాహనాల రాకపోకలను పునరుద్ధరించాలని హెచ్ఎండీఏ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) నిర్ణయం తీసుకున్నాయన్నారు. వాహనాలను అనుమతిస్తున్నందున ప్రజారోగ్య రక్షణ చర్యల్లో భాగంగా ఓఆర్ఆర్‌పై టోల్‌గేట్ నిర్వహణ సిబ్బంది భద్రతా చర్యలు పాటించాలని హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ నిర్దేశించాయి. డిజిటల్ పేమెంట్ పద్ధతిలో ఫాస్టాగ్ చెల్లింపులకు అవకాశం ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించాయి. వాహనదారులు వీలైనంత మేరకు నగదు రహిత లావాదేవీలకు ముందుకు రావాలని హెచ్ఎండీఏ సూచించింది. రాత్రి 7 గంటల నుంచి ఉదయం 7గంటల వరకు కర్ఫ్యూ అమలులో ఉంటున్న నేపథ్యంలో ఆ సమయంలో ఓఆర్ఆర్‌పై కార్లను అనుమతించేది లేదని స్పష్టం చేసింది. ఓఆర్ఆర్‌పై ప్రయాణించే సరకు రవాణా వాహనాల్లో ప్రయాణికులున్నట్లుగా టోల్ ఎ÷-లాజా సిబ్బంది గుర్తిస్తే స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు.

## చరిత్రలో నేటినిజం



కీ॥ జలరి సంపద్పు మాయా
జొలముల్లా ప్రేక్షకులకు సంతసము నిడం
జొలన చేపల పట్టని
జొలరి "సంపదుల మారు" శైలిని గాలుడునే!!



(మే 21 డి.వై.సంపత్కుమారు పుణ్యతిథి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

# సిఎం కెసిఆర్ మెడలో చేనేత కండువా

### చేనేతకు ప్రోత్సాహం ఇచ్చేలా ఉందన్న నేతన్నలు

హైదరాబాద్,మే20(ఆర్ఎన్ఎ): గత కొన్నిరోజులుగా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు వస్త్రధారణలో మార్పుకనిపిస్తోంది. కరోనా నేపథ్యంలో ప్రధాని మెడలో కండువాతో కనిపిస్తున్నారు. అదే తరహాలో సిఎం కెసిఆర్ కూడా కండువాతో కనిపించారు. చేనేత కండువా ధరించడంపై ఇప్పుడు సర్వత్రా చర్చ సాగుతోంది. మిలమిల మెరిసే చేనేత కండువా ఆయనకు మరింత ఆకర్షణీయతను తెచ్చిపెట్టింది. ముఖ్యమంత్రి చేనేత సెల్లను ధరించడం వల్ల నేతన్నలకు ఆయన ఇచ్చిన గౌరవంగా తెలంగాణ పద్మశాలి అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మాచన రఘునందన్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చేనేత సెల్లను ధరించడంతో ఇప్పుడు చాలా మంది వాటి పట్ల ఆసక్తినిచూపిస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేనేతకు చేయూతనివ్వడం వల్ల ఎంతో మంది చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తోందన్నారు. చేనేత సెల్లను మెడకు చుట్టుకోవడం వల్ల ఒక విధంగా కరోనా బారి నుంచి కూడా రక్షణ పొందవచ్చని అన్నారు. చేనేతను ధరించడం వల్ల హుందాతనం, దర్పంతోపాటు ఇతరులకు గౌరవం కూడా కలిగిస్తుందని అన్నారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలుచేయడం వల్ల నేతన్నలను ప్రోత్సహించిన ట్టవుతుందని రఘునందన్ పేర్కొన్నారు. ఇదే అంశంపై తాము పెద్దయెత్తున ప్రచారం చేస్తున్నామని అన్నారు.

# ప్రపంచంలో 50లక్షలు దాటిని కేసులు

న్యూఢిల్లీ,మే20(ఆర్ఎన్ఎ): చాలా దేశాల్లో కరోనా వైరస్ విజృంభిస్తోంది. లాక్‌డౌన్ ఆంక్షలు సడలించడంతో కొన్నిదేశాల్లో కరోనా కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. బుధవారం మధ్యాహ్నం వరకు ప్రపంచ వ్యాప్తంగా కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 50 లక్షలు దాటింది. కరోనా కారణంగా ప్రపంచ వ్యాప్తంగా 3.25లక్షల మంది మృతి చెందారు. అలాగే కరోనా నుంచి 19.72లక్షల మంది కోలుకున్నారు.

ప్రస్తుతం 27,06,730 మంది కరోనా బాధితులు చికిత్స పొందుతున్నారు. వీరిలో 45,400 మంది కరోనా రోగుల పరిస్థితి విషమంగా ఉంది. అత్యధికంగా అమెరికా (1,571,018), రష్యా(308,70), స్పెయిన్(278,803), బ్రెజిల్(271,885) దేశాల్లో అత్యధికంగా కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది.

### ఢిల్లీలో పెరుగుతున్న కరోనా కేసులు

దేశ రాజధాని ఢిల్లీలో కరోనా కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయి. గడిచిన 24 గంటల్లో 534 కరోనా పాజిటీవ్ కేసులు నమోదైనట్లు ఢీల్లీ ఆరోగ్య శాఖ తాజా హెల్త్ బులెటిన్ లో వెల్లడించింది. కరోనా నుంచి మరో 442మంది కోలుకున్నారని తెలిపింది. దీంతో ఢిల్లీలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 11,088కి చేరింది. కాగా, రాష్ట్రంలో ఇప్పటివరకు 176 మంది కరోనాతో మరణించగా, కరోనా బారి నుంచి 5,192 మంది బాధితులు కోలుకొని డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రుల్లో 5,720 మంది చికిత్స పొందుతున్నారు. ఇక, దేశ వ్యాప్తంగా ఇప్పటివరకు కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 1,07,685కు చేరగా.. కరోనా బారిన పడి మొత్తం 3,312 మంది ప్రాణాలు కోల్పోయారు.

# ఢిల్లీ సరిహద్దుల్లో పోలీసులు, కార్మికులకు మధ్య ఘర్షణ

న్యూఢిల్లీ,మే20(ఆర్ఎన్ఎ): ఢిల్లీ - గుర్గావ్ సరిహద్దుల్లో పోలీసులకు, వలస కార్మికులకు మధ్య బుధవారం ఘర్షణ చెలరేగింది. లాక్‌డౌన్ నిబంధనలను కేంద్రం సడలించడంతో తిరిగి పనుల కోసం వలస కార్మికులు సరిహద్దుల్లో ప్రవేశించ దానికి ప్రయత్నించారు. దీంతో బందోబ స్తులో ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. తాము అనుమతించమని పోలీసులు తేల్చి చెప్పడంతో పరిస్థితి అదుపు తప్పింది. వలస కార్మికులు పోలీసులపై రాళ్లు రువ్వారు. పరిస్థితి జటిలంగా మారడంతో అదనపు పోలీసు బలగాలు వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి. మరోవైపు స్థానికంగా ఉన్న ప్రజలు ఈ సంఘటనను సెల్‌ఫోన్లో చిత్రించే ప్రయత్నం చేశారు.

# టీఎన్జీవో గచ్చిబౌలి హౌసింగ్‌సొసైటీకి ప్రారంభం

హైదరాబాద్,మే20(ఆర్ఎన్ఎ): భాగ్యనగర్ తెలంగాణ టీఎన్జీవో గచ్చిబౌలి హౌసింగ్‌సొసైటీ కార్యాలాన్ని బుధవారం ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవీ ప్రసాద్, టీజీవో అధ్యక్షులు మమత, టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి రవీందర్‌కుమార్‌గౌడ్, టిటిఎంజీవో అధ్యక్షుడు ఎం.సత్యనా రాయణ గౌడ్, టీజీవో నగర అధ్యక్షుడు గండూరి వెంకట్, టీ ఎన్జీవో హైదరా బాద్అధ్యక్షుడు ముజీబ్, తదతర ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పాసుల కోసం భారీగా తరలివచ్చిన కూలీలు

చెన్నై,మే20(ఆర్ఎన్ఎ): తమిళనాడు నుంచి తమ స్వస్థలాలకు వెళ్లేందుకు వలస కూలీలు పెద్ద ఎత్తున సిద్ధమవుతున్నారు. శ్రామిక్ రైల్లో వెళ్లేందుకు పాసుల కోసం వలస కూలీలు.. కోయంబత్తూరు, సుందరపురానికి భారీగా తరలివచ్చారు. ఉత్తరప్రదేశ్, బీహార్ వెళ్లే రైళ్ల పాసుల కోసం కూలీలు వేచి చూస్తున్నారు. పాసుల కోసం పిల్లలతో మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో వచ్చారు. వలస కూలీలను తరలించేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు శ్రామిక్ రైళ్లను నడుపుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో బస్సులను నడుపుతున్నారు.

# నియంత్రిత పంటలపై నేడు కీలక సమావేశం



### అధికారులు, కలెక్టర్లతో చర్చించనున్న సిఎం కేసీఆర్
### జిల్లాల వారీగా పంటల ప్రణాళికను వెల్లడించే అవకాశం

హైదరాబాద్,మే20(ఆర్ఎన్ఎ): పంటలసాగు విధానంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 21న గురువారం ప్రగతిభవన్‌లో విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సమావేశానికి మంత్రులు, కలెక్టర్లు, అధికారులు, రైతు సంఘాల నేతలు హాజరుకానున్నారు. జిల్లాల వారీగా పంటల సాగుపై సమావేశంలో చర్చ జరుగనుంది. వరిసాగు ఏ రకం, ఎక్కడెక్కడ వేయాలనే అంశంపై చర్చించనున్నారు. సమావేశం తర్వాత జిల్లాల వారీగా పంటల మ్యాప్‌ను అధికారులు రూపొందించనున్నారు. కేసీఆర్ ఆమోదంతో పంటలు సాగు విధానంపై ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే అధికారులతో పలుమార్లు చర్చించిన సిఎం కెసిఆర్ నియంత్రిత పంటల విధానాన్ని ప్రకటించారు. దీంతో జిల్లాల్లో ఎక్కడెక్కడ ఏ పంటలు వేయాలో ఓ నిర్ణయం తీసుకుంటారు. మొత్తానికి నియంత్రిత పంటల సాగు బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు అప్పగించించింది. ఏ జిల్లాలో ఏ పంట ఎంత మొత్తం విస్తీర్ణంలో సాగుకావాలనే దానిపై ప్రభుత్వం పంట ప్రణాళికను జిల్లా వ్యవసాయ కార్డుల రూపంలో అందిస్తుంది. దీనిని కలెక్టర్లు వారి సంబంధిత జిల్లాల్లో అమలు చేయాల్సి ఉంటుంది. ఈ వానకాలం సాగులో ప్రభుత్వం చెప్పిన ప్రకారం కాకుండా వేరే ఇష్టారీతిన సాగు చేస్తే రైతుబంధును కట్ చేయనున్నారు. ఇప్పటికే ప్రాథమికంగా పంటల మ్యాపింగ్‌ను వ్యవసాయ శాఖ పూర్తి చేసింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు సోమవారం దీనిని ప్రతిపాదించగా ఓకే చెప్పినట్లు కూడా తెలిసింది. దీనిపై మరోమారు కలెక్టర్లు, ఇతర అధికారులతో సిఎం గురువారం మరింత లోతుగా చర్చించనున్నారు. దీని ప్రకారం రాష్ట్రంలో ప్రధానంగా పత్తి, కంది, వరి పంటల సాగును ప్రోత్సాహిం చనున్నారు. మెదక్, నారాయణ్‌పేట్, యదాద్రి భువనగిరి జిల్లాలు మినహా మిగతా అన్ని జిల్లాల్లోనూ పత్తి సాగును పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రధానంగా మూడు జిల్లాల్లో అత్యధికంగా పత్తి పంటను సాగు చేస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈసారి ప్రభుత్వం కంది పప్పు సాగును విపరీతంగా ప్రోత్సాహించాలని పంటల మ్యాపింగ్‌లో నిర్ణయించింది. ఎంత కంది వస్తే అంత మొత్తం మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కూడా సిఎం కెసిఆర్ సోమవారం మీడియా సమావేశంలో ప్రకటించారు. గత ఏడాది వానకాలం సాగుతో పోలిస్తే దాదాపు అన్ని జిలాల్లో కంది పంట సాగును పెంచనున్నారు. మొత్తంగా జిల్లాల వారిగా పంటల సాగు వివరాలను అధికారికంగా ప్రకటిస్తారు.



హైదరాబాద్ నగరంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్లపై ఎంసీహెచ్ఆర్‌డీల సమీక్ష పాల్గొన్న మంత్రి కేటీఆర్

# 80శాతం డబుల్ ఇళ్ల నిర్మాణాలు పూర్తి

### -సమీక్షలో మంత్రి కెటిఆర్ వెల్లడి

హైదరాబాద్,మే20(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని స్పష్టం రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేశారు. హైదరాబాద్‌లో చాలా చోట్ల 80 శాతానికి పైగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని తెలిపారు. ఇప్పటికే కొన్ని చోట్ల లబ్దిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను పంపిణీ చేశామని మంత్రి పేర్కొన్నారు. త్వరలోనే మిగిలిన నిర్మాణాలను పూర్తి చేసి లబ్దిదారులకు పంపిణీ చేస్తామని చెప్పారు. హైదరాబాద్ నగరంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్లపై ఎంసీహెచ్ఆర్‌డీలో మంత్రి కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రులు మహమూద్ అలీ, వేముల ప్రశాంత్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్‌తో పాటు పురపాలక, హౌసింగ్ శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నచోట త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎక్కడా ఆలస్యం లేకుండా పనులు సాగాతన్నారు. పేదలకు త్వరగా అందించేలా కార్యాచరణ చేయాలన్నారు.

# కర్నాటక నుంచి మానుకోట చేరుకున్న వలస కార్మికులు

### వారికి తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన మంత్రి సత్యవతి

హైదరాబాద్,మే20(ఆర్ఎన్ఎ): కర్ణాటక రాష్ట్రం నుంచి మహబూబాబాద్‌కు వచ్చిన వలస కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారిని జాగ్రత్తగా వారి స్వగ్రామాలకు చేర్చేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర గిరిజన, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా నుంచి కర్ణాటకకు వలస వెళ్లి కరోనా లాక్ డౌన్ సమయంలో అక్కడ చిక్కుకున్న వలస కార్మికులు తాము రాష్ట్రానికి రావడానికి సహకరించాలని మంత్రి కేటీఆర్ కు ట్విట్టర్ ద్వారా విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన వారు కావడంతో కేటీఆర్.. సత్యవతి రాథోడ్ కు రీట్వీట్ చేశారు. వెంటనే స్పందించిన మంత్రి సత్యవతి రాథోడ్ అక్కడి వలస కార్మికులను తిరిగి జిల్లాకు రప్పించేందుకు తన సొంత ఖర్చుతో రెండు బస్సులను ఏర్పాటు చేయించారు. వారికి అక్కడి అధికారులతో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ కు సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు తెలంగాణకు రావడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా కలెక్టర్ గౌతమ్ కర్ణాటక అధికారులతో మాట్లాడి వారిని మహబూబాబాద్ కు చేరేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. దీంతో మహబూబా బాద్, కేసముద్రం, గుడూరులలోని వివిధ గ్రామాలకు చెందిన 50 మంది వలస కార్మికులు కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపి రైల్వే స్టేషన్ నుంచి ఈ బస్సులలో నేడు మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. వీరిని జిల్లా యంత్రాంగం దగ్గరుండి ఆహ్వానించారు. కర్ణాటకలో చిక్కుకున్న మాకు తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యంగా మంత్రి సత్యవతి రాథోడ్ కు వలస కార్మికులు ధన్యవాదాలు తెలిపారు. కర్ణాటక నుంచి తెలంగాణ రావడానికి కర్ణాటక అధికారులు కూడా సహకరించారని, వారికి కూడా కృతజ్ఞతలు తెలిపారు. వలస కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారిని స్వగ్రామాలకు తరలించి, హోం క్వారంటైన్ చేస్తామని జిల్లా అధికారులు తెలిపారు.

# ప్రైవేట్ రంగంలోనూ కరోనా టెస్టులు

### హైకోర్టు కీలక ఆదేశాలు

హైదరాబాద్,మే20(ఆర్ఎన్ఎ): కరోనా టెస్టులపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రైవేట్ ఆస్పత్రులు,ల్యాబ్‌లలో కూడా టెస్టులకు అనుమతి ఇవ్వాలని సూచించింది. దీనిపై ఆంక్షలు విధించడం సరికాదని పేర్కొంది. గాంధీ, నిమ్స్‌లోనే కరోనా పరీక్షలు చేయించుకోవాలనడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ కరోనా పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపింది. ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లపై నమ్మకం లేకపోతే... ఆరోగ్యశ్రీ సేవలకు ఎలా అనుమతిచ్చారని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. కరోనా సేవల కోసం ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు... ఐసీఎంఆర్‌కు దరఖాస్తు చేసుకోవాలని హైకోర్టు సూచించింది. ఆస్పత్రులు, ల్యాబ్‌లలో వైద్య సిబ్బంది, సదుపాయాలను... ఐసీఎంఆర్ పరిశీలించి నోటిఫై చేయాలని తెలిపింది. ఐసీఎంఆర్ ఆమోదించిన ఆస్పత్రుల్లోనే... కరోనా చికిత్సకు అనుమతించాలని హైకోర్టు ఆదేశించింది. ఇప్పటి వరకు కేవలం ప్రభుత్వ ఆధీనంలోనే టెస్టులు జరుగుతున్నాయి. దీనిపై దాఖలైన పిటిషన్ సందర్భంగా ఈ విషయంలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.

# బాల వికాసం





## రామచిలుక

అందాల పచ్చపచ్చని రామచిలుక
తోటలోన తిరిగేను రామచిలుక
చెట్టు మీద ఉండెను రామచిలుక
ఎర్రనైన ముక్కు ఉన్న రామచిలుక
తాటి చెట్టు తొర్రలోని రామచిలుక
తొర్రలోన తొంగి చూసే రామచిలుక
అందరికీ నచ్చే రామచిలుక
పంజరమే వద్దన్న రామచిలుక
పండ్లెన్నో రుచి చూసే రామచిలుక
గూటిలోన గుటుక్కున మింగే రామచిలుక
అందాల పచ్చపచ్చని రామచిలుక
తోటలోన తిరిగేను రామచిలుక

– టి.శ్రీనాద్,
2వ తరగతి

## బాల గేయం

### కుమ్మరి మట్టికుండ!

మట్టిముద్ద వెన్నెముద్ద మాదిరిగా
మెత్త మెత్తగా చేతను ఒదిగీ
కుమ్మరి చక్రం మీద తిరుగుతూ
కుదురుగ రూపొందేదే మట్టికుండ!

మండుటెండలో దాహముతీర్చే
చల్లని పానీయమిచ్చు మట్టికుండ!
పెళ్ళిళ్ళకు-స్త్రీల పేరంటాలకు కూడ
పెద్దమ్మ-పోచమ్మ బోనాలకు సైతం
పెద్ద దిక్కుగా నిలుచును మట్టికుండ!

అనాది ఆచారాలకు-మన నాగరికతకూ
ఆనవాలుగా తోచును మట్టికుండ
అడుగడుగున జీవితాన అందరికీ
అన్ని అవసరాల తీర్చు మట్టికుండ
కాని చిన్నరాయి కూడ తగిలినా
తక్షణమే పగిలిపోవు మట్టికుండ!

బాలల్లా సున్నితమౌ మట్టికుండను
భద్ర పరచుకోవాలి పగలకుండను.



– డా।। వద్దేపల్లి కృష్ణ
సెల్: 9246541699

## అప్త్రాల్!

(కథ)

"...ఆ రాజేష్‌గాడు నా పెళ్ళిలో ఏం చదివించాడో తెల్సా?" కోపంతో ఊగిపోతూ అన్నాడు వర్మ.

"ఏం చదివించాడు" అర్థం కాక చూసాడు శర్మ.

"ఆఫ్ట్రాల్ ఒక పెన్ను చదివించాడు. ఇలాంటి మిత్రుడున్నందుకు అందర్లో సిగ్గుతో తలకొట్టేసినట్లైందనుకో..." అవమానంతో ఫీలవుతూ చెప్పాడు వర్మ.

అంతలో అక్కడికి ఒక వ్యక్తి వచ్చి 'సార్! ఈ కాగితాల మీద అర్జంట్‌గా సంతకం చెయ్యండి. మీ ఆస్తిని రిజిస్టర్ చెయ్యాలి" అన్నాడు.

వెంటనే జేబులో పెన్ను తీసుకొని సంతకం చేయబోయాడు వర్మ.

ఉన్నట్లుండి శర్మ అతని చేతిలోని పెన్నును లాక్కున్నాడు.

దానికి వర్మ– "ఏమిట్రా ఇప్పుడు పరాచికాలు. ఆ పెన్ను ఇటివ్వు. లేకపోతే రిజిస్ట్రేషన్ ఆగిపోతుంది" అన్నాడు .

"నీకు ఆఫ్ట్రల్ ఈ పెన్నుతో పనేముందిలే" అన్నాడు వెటకారంగా.

"ఏమిట్రా అలా అంటావ్?" అన్నాడు అర్థంకాక వర్మ.

"అవును! ఇందాక నువ్వే తేలిగ్గా తీసిపారేసావు కదా 'ఆఫ్ట్రాల్ పెన్ను' అని. నువ్వు సంతకం చెయ్యకపోతే ఈ కాగితాలకి విలువ ఉండదు. అలాగే ఈ పెన్ను లేకపోతే నువ్వు నిశానిగా పరిగణింపబడి అవమానమూ పొందుతావు. కనుక ఎప్పుడూ దేన్నీ తక్కువచేసి మాట్లాడవద్దు" హితభోద చేసాడు శర్మ.

పెన్ను విలువ తెలుసుకున్న వర్మ చేసిన తప్పుకు సిగ్గుతో తలదించుకున్నాడు.



–చలపాక ప్రకాష్
సెల్:9247475975

## బాలల మనో వికాసం.. 'చదువుల బాబు' కథల లక్ష్యం..!

పుస్తక సమీక్ష

బాలల మనో వికాసమే ధ్యేయంగా డి.కె. చదువుల బాబు 'వజ్రాలవాన' పేరుతో బాలల సాంఘిక జానపద కథల పుస్తకాన్ని వెలువరించారు. తుంబలి శివాజీ గీసిన చిత్రాలతో అందంగా ముస్తాబై వచ్చిన ఈ పుస్తకంలోని కథలన్నీ పిల్లలు ఆసక్తిగా చదవడానికి మలచబడ్డాయి. బాల బాలికల వ్యక్తిత్వ వికాసానికి.. విజ్ఞాన పెంపుదలకు.. సర్వాంగీణ ఉన్నతికి ఉపయోగపడే విధంగా ఇందలికథలు కొలువుదీరాయి. పిల్లలు సదాచార సంపన్నులు కావడానికి వీలుగా కథలకు ఇతివృత్తాలను ఎంపిక చేసుకున్నారు. ఈ కథలు బాల బాలికల్ని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దడానికి యోగ్యంగా ఉన్నాయి. సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి, పిల్లల్లో సద్గుణాలను నిర్మాణం చేయడానికి వీలుగా 27 కథలను పొందుపరిచిన ఈ పుస్తకంలో రచయిత డి.కె. చదువుల బాబు యొక్క సృజనాత్మక ప్రతిభ కానవస్తోంది. పిల్లల్ని చక్కని ప్రయోజకులుగా మార్చాలన్న ఆరాటం.. వారి వికాసం కోసం ఏదో చేయాలన్న ఉబలాటం.. రచయితకున్నట్లు.. అడుగడుగున కానవస్తుంది. ప్రతి కథకూ.. నిండుదనంతో పాటు పిల్లలకు ఆసక్తికలిగించేలా చిత్రాలు జోడించారు.

మొదట కథ "అమ్మ"లో.. తల్లిదండ్రులను ఆదరించని వారిని శిక్షిస్తూ ప్రజలు చెడు అలవాట్లను వదిలే విధంగా, చైతన్య వంతులను చేయటానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన రాజును అందరం అభినందించి తీరుతాం.

'చాకచక్యం' కథలో.. రాముడు ప్రదర్శించిన




చాకచక్యం బాగుంది. 'ఐదు ప్రశ్నలు' కథలో.. తాగుడు, అవినీతి, బాల్య వివాహాలు, చెట్లను నరకడం, మొక్కల పెంపకంపై దృష్టిపెట్టక పోవడం తమ రాజ్య పతనానికి కారణమని రాజుకు నేర్పుగా, వివరించిన నందుడు అభినందనీయుడు. 'కోతి వైద్యం' కథ సందేశాత్మకంగా ఉంది. 'ఒక్కసారి ఆలోచిం చండి' కథలో ప్రజాచైతన్యమే సమాజాన్ని కాపాడగలదు అన్న సందేశం బాగుంది. 'పద్మనందుని కోరిక' కథలో పద్మనందుని కోరిక పద్మనందుని ప్రతిభకు అద్దం పట్టే విధంగా ఉంది.

"మంచిమిత్రుడు" కథ ఇతరులలో మంచిని చూడాలనీ.. చేతనైన సహాయం చేయాలన్న సందేశంతో మలచబడింది. ఈ కథలోని పాత్రలన్నీ ఉన్నతంగా చిత్రింపబడినాయి. 'సమయ స్ఫూర్తి' కథలో.. రమణయ్య సమయస్ఫూర్తిని చూస్తాం. 'వజ్రాల వాన' కథలో.. సోమరితనం పనికిరాదన్న విషయం గ్రహిస్తాం.

ఇంకా ఇందులోని మిగతా కథలూ పిల్లల్లో నైతికతను పెంపొందించే దిశలో రాయబడినాయి.

పిల్లలు సులభంగా చదువుమని అర్థం చేసుకోవడానికి వీలుగా సరళంగా.. పదబంధాలను ప్రయోగించారు.

ముఖచిత్రం రంగు రంగుల హంగులతో అందంగా గీయబడింది.

బాల బాలికలకు ఉపయుక్తమైన పుస్తకమిది. ప్రతి బడిలో.. గ్రంథాలయంలో ఉండదగింది.

**ప్రతులకు:**తుంబలి శివాజి
కే/ఆఫ్. రవీంద్ర తిలక్ ప్రచురణలు
3/528-2, యుపి
వై.ఎం.ఆర్. కాలనీ
ప్రొద్దుటూరు జిల్లా కడప.



– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

## ఆశతో ఎదురుచూపులు

ఎక్కడ దీని జన్మస్థానం?
మరెక్కడ దీని ప్రస్థానం?
శాస్త్రజ్ఞులకు కూడ అంతుపట్టలేదు దీని వివరం!
అదృశ్యంగా ఉన్న ఈ దుష్టశక్తి
రాక్షసరూపంలో ప్రపంచ మంతటిని
అల్లకల్లోలం చేసింది!!
మనసుకంటే వేగంగా ప్రసరించి
ఎందరెందరో జీవితాలను అతలాకుతలం చేసింది!!
ఇదిమానవుల తప్పిదమా?
ప్రకృతి యొక్క వికృతమా?
సముద్రం మథించినపుడు ఉద్భవించి,వ్యాపించిన
హాలాహలాన్ని పరమశివుడు
దోసిలితో ఆస్వాదించి నీలకంఠుడయ్యాడు!!
ఇప్పుడు చిమ్మిన ఈ విషాన్ని అంతమొందించి
కాపాడెవారెవరు?
శాస్త్రజ్ఞుల నిరంతర యజ్ఞం ఫలించెదెపుడో?
అంతలో ఎంత వినాశనమో?
మాయారాక్షసుల రూపాలవలె, విభజనమవుతూ
ప్రళయాన్ని సృష్టిస్తూ వుంది
కనబడని ఆ భగవంతుడే, ఈ అదృశ్య
దుష్టశక్తిని అంతమొందించాలి
కాలమే గాయాన్ని మాన్పినట్టు
ఈ సమస్యను కూడ పరిష్కరించాలి
భయం గుప్పిట్లో బతుకుతున్న
మానవులకు స్వాంతనమెపుడో?
పాండవుల అజ్ఞాతవాసంలాగే
ఇప్పుడు ప్రపంచమే అజ్ఞానంలో ఉంది!
ఇంట్లోనే బందీలయ్యారు
బడుగు జీవులకు బ్రతుకు తెరవు లేదు!
శుభకార్యాలు స్థంబించిపోయాయి
శ్రమించే శ్రమజీవులు శాపగ్రస్తులైనారు!!
వసంత ఋతువు మళ్ళీ వచ్చి
మూడు పూవులు ఆరు కాయలతో
వనమంతా వినబూయాలి
పువ్వులే నవ్వులై విరియాలి
కోయిల తన గొంతుతో మధురంగా పాడి
హర్షాన్ని వెలిబుచ్చాలి!
మానవుల మనసంతా సంతోషంతో
నిండి వెల్లివిరియాలి!!
ముక్కోటి దేవతలతో ఏ ఒక్కరైనా
కరుణించి కాపాడరా..అని
ప్రార్థిస్తూ..ఎదురుచూస్తూ..



– దేశాయ్ పద్మావతి
సెల్: 7738711453



# కరోనా నేర్పిన జీవనశైలి పాఠాలు



– డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

డిసెంబర్ 2019 చివరి వారంలో చైనా దేశంలోని వూహాన్ మహానగరంలో బయట పడిన కరోనా వైరస్ సృష్టించిన మహా విలయానికి ప్రపంచ దేశాలన్ని గత నాలుగున్నర మాసాలుగా లాక్‌డౌన్ ప్రటించుకొని మానవాళి స్వీయనిర్బంధంలోనే ఉన్నారు. ఈ విశ్వమహమ్మారి కల్లోలంలో నేటికి దాదాపు మూడు లక్షల మరణాలు, 44 లక్షలకుపైగా పాసిటివ్ కేసులు మరియు 17 లక్షల కరోనా సోకి చికిత్స పొంది బయట వారు ఇప్పటికి నమోదైనాయి. ఈ ప్రళయం ఇంకా కొనసాగుతూనే ఉంది. కరోనా వైరస్‌కు టీకా కనుగొనే ప్రయత్నంలో ప్రపంచ ప్రఖ్యాత పరిశోధనా సంస్థలు కృషి చేస్తూనే ఉన్నారు. టీకా మందులు కనుగొని ఆచరణలోకి రావటానికి కనీసం ఒక సంవత్సరం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రపంచ దేశాలన్ని లాక్‌డౌన్ కుదుపులకు ఆర్థికంగా చితికి పోతున్నాయి. సాధారణ ప్రజాజీవనం పూర్వ స్థితికి రావాలనే సంకల్పంతో ప్రభుత్వాలు లాక్‌డౌన్‌ను తొలగించి అన్ని రంగాలు తమ తమ కార్యాలను కొనసాగించాలనేలా సూచనలు ఇస్తున్నాయి. కరోనాతో కలిసి తగు జాగ్రత్తలను తీసుకుంటూ జీవితాన్ని సాగించాల్సిన అనివార్యత వస్తోంది. ఇప్పటి వరకు గృహనిర్బంధవ్రతంలో నిక్కంగా ఉన్న కుటుంబాలు లాక్‌డౌన్ తొలగించిన తరువాత మరింత జాగరూకతతో గడపాల్సిన సమయం ముందున్నది. మనం విర్రవీగుతా విచ్చలవిడిగా ఏర్పరుచుకున్న ఆధునిక జీవనశైలిలోంచి బయటపడి, కరోనా నేర్పిన నూతన జీవన విధానాన్ని పాటించాల్సిన అగత్యం ఏర్పడింది. నిశాచరుడిలా నరుడు పబ్బులు, క్లబ్బులు, రేవ్ పార్టీలు, రిసార్టుల్లో చిందులు, మత్తులు గమ్మత్తులు, విందులు, వినోదాలెన్నో కేళి విలాసాలు చేశాడు. ఏ మాత్రం ఇలాంటి అశ్రద్ధ చేష్టలు చేసినా కరోనా కబంధహస్తాలలో చిక్కి ఆసుపత్రి పాలుకావడం జరుగొచ్చు. ఇప్పటి వరకు పాటిస్తున్న సామాజిక దూరాలు తప్పక కొనసాగించాల్సిందే. ముఖానికి మార్కులు ధరించటం నిత్య నియమం కావాలి. సానిటైజర్‌లను వాడటంతో పాటుగా తరుచుగా చేతులు శుభ్రపరుచుకోవాలి. పూర్వపు ఆచారాలను ఆదరిస్తూ ఇంట్లోకి అడుగిడే ముందు కాళ్ళు, చేతులు, ముఖం(ఇంటికి వచ్చిన ప్రతిసారి) సబ్బు నీటితో శుభ్రపరుచుకోవాలని మరువరాదు. క్రమశిక్షణ గీత దాటితే కరోనా కాటు వేయక తప్పదన్న విషయం గుర్తుంచుకోవాలి.

మన దైనందిన ఆధునిక దినచర్యను సమూలంగా మార్పులు చేసుకొనుట తప్పనిసరైంది. సనాతన భారతీయ సంప్రదాయ అలవాట్లను గౌరవించాల్సిన కర్కశ కరోనా సమయమిది. అవసరం ఉంటేనే కాలు బయట పెట్టాలి. సరదాలు కోసం రోడ్డెక్కడం ప్రమాదకరం. మన హద్దులలో మనమే ఉండాలంటోంది మహమ్మారి కరోనా. మార్కెట్ పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తిచేసుకోవాలి. ప్రతి చిన్న విషయానికి బయటకు వెళ్లరాదు. హోటల్స్, మొబైల్ టిఫిన్ సెంటర్లు, క్యాంటీన్లు, రోడ్డు సైడ్ తోపుడుబండ్లు లాంటి ప్రదేశాల నుండి ఆహార పదార్థాలను తీసుకోరాదు. విలాసాలే జీవితం కాదని, ఇంట్లోనే స్వర్గం ఉందని భావించి కుటుంబమంతా ఇంటి వంటను పరమాన్నంగా తీసుకోవాలి. బయట కనీసం తేనీరు కూడా తీసుకోరాదు. సమీప బంధువులు, ప్రాణ మిత్రులతోనైనా సామాజిక దూరాలను పాటించాల్సిందే. మొహమాటం ఏ మాత్రం పనికి రాదు. ఇతరులు తాకిన వస్తువులను తాకడం మంచిది కాదు. నీ కారణంగా కూడా వైరస్ వ్యాప్తి జరుగవచ్చని దూరాచారాల గీతలు దాటకుండా నియంత్రణలో ఉందాం. ప్రయాణాలు చేయటం వీలైనంత వరకు రద్దు చేసుకోవాలి. బైక్, కార్ లాంటివి పరిమితంగా వాడుతూ పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలి. ప్రజా రవాణా వ్యవస్థను(రైలు, బస్సు, విమానం) వినియోగించటం కొంత

> మనం విర్రవీగుతా విచ్చలవిడిగా ఏర్పరుచుకున్న ఆధునిక జీవనశైలిలోంచి బయటపడి, కరోనా నేర్పిన నూతన జీవన విధానాన్ని పాటించాల్సిన అగత్యం ఏర్పడింది.

కాలం తగ్గించాలి. శుభకార్యాలు, సభలు, సమావేశాలకు దూరంగా ఉందాం. ప్రజలు ఎక్కువగా గుమిగూడే ప్రదేశాలకు వెళ్ళకపోవడం శ్రేయస్కరం.

ఆసుపత్రుల సందర్శన, జబ్బున్న వారిని పరామర్శించడం ప్రమాదకరం. బయటకు వెళితే కనీసం నీరు, చాయ్ కూడా తాకరాదు. శాకాహార భోజనం ఆరోగ్యకరం. వ్యాధి నిరోధకశక్తిని పెంచే ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి. పిజ్జా, బర్గర్, ఫాస్టఫుడ్‌లకు దూరంగా ఉందాం. ఉదయం లేదా సాయంత్రం వాకింగ్ చేసే వారు జనం లేని ప్రదేశాలను ఎన్నుకోవాలి లేదా ఇంట్లో యోగాసనాలు వేసుకుంటూ ఆరోగ్యాన్ని మరియు వ్యాధి నిరోధకతను పెంచుకోవాలి. అకారణంగా ఇతరుల ఇండ్లకు వెళ్లడం, మన ఇంటికి ఇతరులను ఆహ్వానించటం వాంఛనీయం కాదు. సినిమాలు, మాల్స్, పార్టీలు, సెలూన్స్, బ్యూటీపర్లర్స్, బార్లు, షాపింగ్ కాంప్లెక్సులు మెొదలగు చోట్లకు వెళ్లరాదు. వీలైతే షాపింగ్‌లకు దూరంగా ఉంటూ డబ్బులు ఆదా చేయాలి. రాబోయే రోజుల్లో ఆదాయాలు తగ్గవచ్చు. బెల్టులు, చేతి ఉంగరాలు, చేతిగడియారాలు, నగలు ధరించుట మంచిది కాదు. వీలైనంత వరకు మొబైల్ ఫోన్‌లకు కూడా దూరంగా ఉండాలి. బూట్లు మరియు పాదరక్షణలను ఇంటిలోకి తీసుకెల్లరాదు. మన ఇంటిలోని ఫర్నీచర్, లోహ వస్తువులు, ప్లాస్టిక్ వస్తువులను తరుచుగా సానిటైజ్ చేయాలి. ఏ ప్రదేశంలో ఉన్నప్పటికి సామాజిక దూరాన్ని తప్పక పాటించాలి. విద్యార్థినీవిద్యార్థులు ఆన్‌లైన్ తరగతులకు అలవాటు పడాలి. విద్యాలయాలలో సూచించిన మేరకు నిబంధనలు విధిగా పాటించాలి. క్రీడామైదానాలలో ఆటపాటలకు హద్దులు పెట్టుకోవాలి. అపార్టుమెంట్లలో ఉన్న కుటుంబాలు కలిసి ఒకే దగ్గర గడుపరాదు. ఆరోగ్యంగా ఉన్నంత మాత్రాన వైరస్ సోకలేదని అర్థం కాదు. పిల్లలు మరియు వృద్ధులను అతి జాగ్రత్తగా చూసుకోవాలి. ఒకే వాహనంలో ఎక్కువ మంది కిక్కిరిసి ప్రయాణించటం వలదు. స్వల్ప జ్వరం, దగ్గు, తుమ్ములు ఉన్నట్లైతే వెంటనే డాక్టర్‌ను(వీలైతే ఆన్‌లైన్‌లో) సంప్రదించాలి. కరచాలనం, ఆలింగనం, ఒకరి శరీరాన్ని మరొకరు తాకడాన్ని కరోనా నిషేదించింది. నమస్కారమే నవ్య సంస్కారం అంటోంది. టీవిలో కరోనా సంబంధ సుధీర్ఘ వార్తలను తరుచుగా చూస్తూ ఉద్రేక పడరాదు. వ్యాధి లేదా వైరస్ కన్న భయం చాలా చెడ్డది. ఇరుగు పొరుగు వారిని ప్రేమించడం, వారికి సలహాలు మరియు సూచనలు చేస్తూ అందరు బాగుండాలనే సమాలోచనలు చేయాల్సిన సమయమిది. భౌతికంగా దూరంగా ఉంటూ, మానసికంగా దగ్గరగా ఉండటం జీవనశైలిలో భాగం కావాలి. ఇంటిలో జన్మదినోత్సవాలు, పెళ్ళిరోజులు మెొదలగునవి రద్దు చేసుకొని, గృహానికే పరిమితం కావాలి. ఈ కరోనా విధించిన కొత్త సంప్రదాయాలను యువత తమకు అనుకూలంగా మార్చుకొని జ్ఞానసమపార్జనకు కేటాయిస్తే అనంతర జీవితం ఉజ్వలంగా ఉంటుందని తెలిసి మసలుకోవాలి. కరోనా అకాలంలో నిస్వార్థంగా సేవలందించిన మానవతామూర్తులతో కృతజ్ఞతా పూర్వకంగా మసలుకొందాం. జీవం ఉంటేనే జీవితం. ప్రాణం ఉంటేనే ప్రగతి పయనం. చేతులు కాలాక ఆకులు పట్టొద్దు. దీపం ఉండగానే ఇల్లు, ఒల్లు సక్కబెట్టుకుందాం. స్వయంకృతాపరాధంతో ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు. ఎప్పటికైనా ఆరోగ్యమే మహాభాగ్యం. సంతోషమే సగం బలం. అధైర్యమే అనర్థదాయకం. కరోనాకు సరైనా టీకా మందులు అందుబాటులోకి వచ్చేంత వరకు మనల్ని మనం మరియు ఇతర సమాజాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరు మీద ఉంది. కనిపించని కరోనాకు ధీటైన జవాబు మన నవ్య జీవనశైలియే అనుకుంటూ, నియమాలన్నింటిని పాటిస్తూ రేపటి వెలుగుల కోసం ఎదురుచూద్దాం.

## నాటి మాట..నేటి మాట

కాళ్ళు, చేతులు కడిగితే
నీళ్ళు అయిపోతాయి అనేడిది నాటి మాట
కాళ్ళు,చేతులు కడగకపోతే
కరోనా సోకుతుంది అనేది నేటి మాట.
చేతిలో చెయ్యి కలిపితే
చెలిమి పెరుగుతుందనేడిది నాటి మాట
చేతిలో చెయ్యి వేస్తే
చేటు వస్తుందనేడిది నేటి మాట.
ఆలింగనము చేసుకుంటే
ఆత్మీయత పెరుగుతుదనేది నాటిమాట
ఆనలింగనము చేసుకుంటే
అంటురోగాలు సోకుతాయనేది నేటి మాట
వీధులలో తిరుగుతే
విషయాలు తెలుస్తాయి అనేది నాటి మాట
వీధులలో తిరుగుతే
విషపు వైరస్ సోకుతాది అనేది నేటి మాట
దగ్గర దగ్గరగా నిలబడితే
ధైర్యంగా ఉంటాననుకునేది నాటి మాట
దగ్గర దగ్గరగా నిలబడితే
దగ్గు, దమ్ము వైరస్ సోకుతుందనేది నేటి మాట.



– సిరిగాద శంకర్
సెల్: 9493301985

## పిల్లలు

అందమైన పిల్లలు
చక్కగా బడికి వచ్చే పిల్లలు
చేయి చేయి కలిపారు.
ఆటలు ఆడే పిల్లలు
అందరు ఒకటిగా కలిశారు.
ఆటలు బాగా ఆడారు.
చక్కగా చదివే పిల్లలు
సంతోషంగా ఉన్నారు.

-టి.నరేష్
2వ తరగతి

## చెట్టు

చెట్టు మనకు నీడ ఇచ్చేను
చల్లటి గాలి మనకు ఇచ్చేను
పూలు,పండ్లు మనకు ఇచ్చే చెట్టు
ఆకులు,కలపను ఇచ్చే చెట్టు
ఎండా,వాన నుంచి కాపాడే చెట్టు
చచ్చి కూడా చీల్చి ఇచ్చు తనువు
చెట్లు లేనిదే బతుకేలేదు.

-టి.శ్రీనాద్
2వ తరగతి

## కొంగ

కొంగ కొంగ పాలుపోయ్
నిమ్మచెట్టుకు నీళ్ళుపోయ్
కాకరచెట్టుకు కాయలుకోయ్
చింత చెట్టుపై చిందులేయ్
పనస చెట్టుకు పాదులు చేయ్
ఉల్లిపాయకు ఊయలేయ్
అబ్బాయికి అప్పలుతే
చెరువులోన చేపలుతే
నీనోట్లో చక్కెరేస్తా
నా నోట్లో చేపలేయ్

-పి.ప్రకాష్,
2వ తరగతి

# కరోనాపై కదనభేరి గ్రంథావిష్కరణ

ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనాపై విస్తృత స్థాయిలో సాహిత్యం వెలువడటం అభినందనీయమని కరీంనగర్ జిల్లా అదనపు పాలనాధికారి శ్యాం ప్రసాద్ లాల్ అన్నారు.మే17, ఆదివారం రోజున తమ క్యాంపు కార్యాలయంలో డా.వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన నానీల సంకలనం"కరోనాపై కదనభేరి"ని జిల్లా అదనపు పాలనాధికారి శ్యాం ప్రసాద్ లాల్ గారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కవిత్వంతో సృజనకారులు, చిత్రాలతో చిత్రకారులు, రచయితలు,కథకులు ప్రతి ఒక్కరూ కరోనా పట్ల అవగాహన కల్పిస్తూ ప్రజలను

### కరోనాపై విస్తృత సాహిత్యం అభినందనీయం

జాగృతం చేయడం పట్ల తమ హర్షాన్ని ప్రకటించారు. ఇరు తెలుగు రాష్ట్రాల కవుల నానీలతో కూడిన సంకలనాన్ని ప్రచురించిన వైరాగ్యం ప్రభాకర్ ను ఈ సందర్భంగా ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రముఖ. రచయిత కవి విమర్శకులు దాస్యం సేనాధిపతి, యస్.ఆర్.ఆర్.డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కలువకుంట రామకృష్ణ , సాహితీ గౌతమి ప్రధాన కార్యదర్శి గాజుల రవిందర్ ,తెలంగాణ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు అనుముల దయాకర్ పాల్గొన్నారు.



'కరోనాపై కదన భేరి' నానీల సంకలనం ఆవిష్కరించిన జిల్లా అదనపు పాలనాధికారి శ్యాం ప్రసాద్ లాల్ .

నేటినిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

గురువారం 21-5-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3


## నమ్మలేని నిజాలు

కంటి కన్నీటి
ఒంటి చెమట నీటి
కథలు వేరు

బాలీవుడ్ తార
ఆర్.కె.వంశ సితార
రిషి దులార

కూలి బతుకు
అన్నమో రామచంద్రా!
పనికి పాట్లు

వలస కూలి
ఆకలి అగచాట్లు
తీర్చవు చప్పట్లు

సొంతూరి కల
మృత్యువు వడిలోకి
చేరని గమ్యం



- రేడియమ్
సెల్: 9291527757

## శ్రీనిజాలు

వేల మైళ్ల నడకలతో
ఇదేం రాక పోక ?
ఏడ పుట్టె ఏడ పెరిగె
ఈ వలసల మూక ?

కడుపేద యమగండమే
కరోనా తీరుతెన్నులు !
కట్టె బొమ్మలౌతారా
కరుణించని సంపన్నులు ?



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## చుక్కల జండా

అగ్రరాజ్యం
నిలువెల్లా
కంపించి పోతోంది
దిక్కు తోచని
చుక్కల జండా
ఎండుటాకు కదిలినా
విలవిల లాడుతోంది

నిన్నటి దాకా
పెద్దీర్కం చేసిన పెద్దన్న
క్వారంటైన్‌లో నిలుచుని
ఇవ్వాళ్ళ తనకు తానే ఏకాకి



కాలరెగరేసిన డాలర్
నేపాల్ రూపాయ్
రెండు వీధిలోనే నిలుచున్నాయి
బంధ్లు ఓడలవుతున్నాయి
ఓడలు బండ్లవుతున్నాయి
లాపరవా ఎంత పని చేసింది
ఎంత అభివృద్ధి చెందితే ఏం లాభం
విచ్చలవిడి తనం, విశృంఖలత్వం
నిట్టనిలువునా ముంచేసింది
తప్పు చిన్నదైనా పెద్దదైనా
ఫలితం అనుభవిచాల్సిందే !
కళ్ళ ముందటే
మనుషులు పిట్టల్లా రాలుతుంటే
క్షణాల్లో శవాల గుట్టలు
పేరుకు పోతున్నాయి
ఖననం చేసేందుకు
కాలానికి గాలం వేయాల్సిందే
పెద్దన్నదెప్పుడూ
పనికిరాని పెద్దరికమే...
అవసరమున్నా లేకున్నా
ఓవర్ రియాక్షనే...
అది హెచ్ వన్ బి ఐనా

కరోనా అయినా
అనవసర రాద్ధాంతమే !
వైరస్ ఇప్పుడు
ఏ రూపంలోనైనా రావచ్చు
జాత్యాహంకారం కావచ్చు
ఆధిపత్య.... కావచ్చు
అంకుల్ సామ్ !
మైడియర్ అంకుల్ సామ్!
కాలుతున్నది పక్కిల్లే అని
చల్ల కదలకుండా కూచుంటే
ముడ్డిమీది బట్టన్నా మిగలకపాయె
ఇప్పుడు ఆకులు ఎన్ని చుట్టుకున్నా
ఉప్పోసకే తప్ప ఉపశమనముండదు.



-డా. పత్తిపాక మోహన్
మొబైల్ : 9966229548



## మధ్యతరగతి

అసలే మధ్యతరగతి
ఆపై మహా విపత్తు
బడ్జెట్ ప్రణాళికలతో
నడిచే జీవితాలు
నెలజీతం రాగానే
వాయిదాలు స్కూల్ ఫీజు లు
వగైరా లమధ్య విభజన
ఒక రోజైనా గడవకుండానే
ఒకటో తేదీ కోసం
ఎదురు చూపు లు
అయినా మేక వన్నె పులి
గాంభీర్యం
అసంతృప్తి లోనే
తృప్తి పడుతూ
బతికే మధ్యతరగతికి

గాంభీర్యం సడలి
పోతున్నది
బ్యాంకు లో భద్రంగా
దాచుకున్న డబ్బు
ఐసులా కరిగి పోతుంది
అప్పు ఇచ్చేవారు లేరు
ఎప్పుడు లాక్ డౌన్
ముగుస్తుందో
ఎప్పుడు జనజీవనం
గాడిన పడుతుందో
తెలీదు అయినా
మధ్యతరగతి
ఆశనిత్య నూతనంగా నే
ఉంటుంది
లాక్ డౌన్ అనంతరం

వచ్చే కొత్త జీవన
విధానానికి
కొత్త ప్రణాళిక లు
వేసుకుంటూ
ఆశలకి కొత్త ఊపిరి నిస్తూ
ఎదురు చూస్తు న్నది
మధ్యతరగతి



-వీ.వి.యస్.కృష్ణ కుమారి
సెల్: 9494510994



# ఏకబిగిని చదివించే ఎస్వీ కవిత్వం

పుస్తక సమీక్ష



"మా చిన్నప్పుడు ఇంటినిండా మనుషులుండే వారు
వస్తువులను చూడటానికి వేం నూమాయిష్ కెళ్ళేవాళ్ళం.
ఇప్పుడు ఇంటినిండా వస్తువులున్నాయ్
మనుషులను చూడటానికి నూమాయిష్ కొస్తున్నాం!"

ప్రతి ఏటా హైద్రాబాద్‌లో 40 రోజులు నిర్వహింపబడే 'నుమాయిష్'ను తెలుగు విశ్వ విద్యాలయం మాజీ ఉపకులపతి ఎస్వీ. సత్యనారా యణ దర్శించిన తీరు యిది. నిజమే! లక్షలాది ప్రజలు సందర్శించే నుమాయిష్‌లో కొనుగోలు దార్ల కన్న కనువిందు కోసం వచ్చేవారి సంఖ్య గణనీయం. మరెందుకు యింతగా ఎగబడ్తున్నారు? యింట్లోని ఇరుకు గదుల నుండి విశాల ప్రపంచంలోకి అడుగు పెట్టిన అనుభూతి, మానసికోల్లాసానికి అదో వేదిక.

"అప్పుడు ఇళ్ళల్లో మనుషులుండే వారు
మనసులుండేవి, మమతలుండేవి
ఇప్పుడన్నీ వస్తువులే వస్తువులు" అంటు ముక్తాయిస్తారు ఎస్వీ.

సాహితీ ప్రపంచం ప్రేమగా 'ఎస్వీ' అనిపించు కునే ఎస్వీ సత్యనారాయణ ఉద్యమ కవి. అభ్యుదయ కవి. 'తెలుగులో ఉద్యమ గీతాలు' అనే అంశంపై పరిశోధించి పిహెచ్‌డి పట్టా పొందిన మేధావి. రాష్ట్రస్థాయిలోనే గాక జాతీయ స్థాయి అభ్యుదయ రచయితల సంఘంలో క్రియాకీలక పాత్ర పోషించిన కార్యశీలి.

'ఉద్యమం ఉద్యమమే. పేరిటతన నాలుగవ కవితా సంపుటిని తాజాగా వెలువరించారు ఎస్వీ.

"ఉద్యమం ఒక ఊత పదం కాదు
ఊకదంపుడు ఉపన్యాసమూ కాదు
ఎత్తిన పిడికిళ్ళలోని రక్త కేతనం-ఉద్యమం
ఉద్యమం ఒక నిరంతరం సజీవ చైతన్య ప్రవంతి
పర్యా పదాలుండవు.. ఉద్యమం ఉద్యమమే"!

యిదీ ఉద్యమం పట్ల ఎస్వీ నిర్దిష్ట అభిప్రాయం. లోతైన అవగాహన.

చిట్యాల అయిలయ్య, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం, దొడ్డి కొమరయ్య, షేక్ బందగీ, షోయబుల్లాఖాన్ రావినారాయణరెడ్డి వంటి ఉద్యమయోధులు చరిత్ర పుటల్లో స్ఫూర్తిదాయకంగా శాశ్వత స్థానం అలరించారు అంటారు కవి. యిక పోరాట వీరులంటావా?రాజేందర్ సింగ్, మేధా పాట్కర్, అన్నా హజారే, చెరబండ రాజు, వరవం´రావు మొదలగు వారిని ""పోరాటానికి ప్రతీకలు"గా నిలబెట్టారు.

"పత్రికా గోష్ఠిలో ప్రగల్భాలు పలకడం
రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పార్టీ పేరు నమోదు చేసుకోవడం
ముచ్చటగా మూన్నెళ్ళకోసారి చుట్టపు చూపుకు రావడం
టీ.వీ. ఛానళ్ళలో చక్కటి చిలుక పలుకులు పలకడం
పోరాటం ఒక వీరమాత సింధూరం
ఉత్తమ యోధుల నెత్తుటి సంతకం" బలమైన వ్యక్తీకరణ ఎస్వీ పంథా. కవిత్వం రాయడంలోనే కాదు..ప్రసంగిం చడంలో కూడా ఎస్వీది ప్రత్యేకమైన ధోరణి, మంచివక్త, అనర్గళంగా, ముక్కుకు సూటిగా, ఘాటుగా తన అభిప్రాయాలు వెలువరించగల ధీశాలి.



అమ్మ గురించి కవిత్వం రాయనికవి బహుశాః వుండదేమో! ఎస్వీ దీనికి మినహాయింపు కాదు.

"అ" అంటే అమ్మ
"ఆ" అంటే ఆప్యాయత
ఎన్నటికీ తీర్చుకోలేని ఋణం 'అమ్మ'
పదకోశంలో ఇంతకన్నా గొప్పపదముందా?
నిఘంటువులో ఈ పదానికి మించిన అర్థముందా?

యిలాంటి అమృతమూర్తిని
"అంట్లు తోమే ఆయాగా
బూజులు దులిపే పనిమనిషిగా
ప్రసవాలు జరిపే నర్సుగా
ఇంటిని కాపలాకాసే గూర్ఖాగా మాత్రం
దిగజార్చకండి
అమ్మగా గౌరవిస్తారో లేదో తెలియదుగానీ
ప్రాణమున్న మనిషిగా గుర్తిస్తే చాలు.."

కొందరికి చర్నాకోలుతో వీపు మీద చరిచినట్లు వుందిగదూ! ఎస్వీ స్వరమే అంత. దటీజ్ ఎస్వీ.

ఈ మధ్య తల్లిదండ్రులు కొందరు, వారి పిల్లలు తాము నిర్దేశించిన పథంలో పయనించి విదేశాల్లో స్థిరబడి డాలర్లు సంపాదిస్తే చాలనుకుంటున్నారు. ఈ దిశగా పెంపకం సాగిపోతోంది. పుట్టగానే డబ్బాపాలు, చైల్డ్‌కేర్ సెంటర్, రెసిడెన్షియల్ స్కూళ్ళు, హాస్టళ్ళ తిండి, గానుగెద్దు జీవితం, ఓ ఇంజనీరు పట్టా..ఆపై విదేశీయానం యిక పిల్లలకు స్వేచ్ఛ ఏదీ? తమకు తాముగా తమ భవిష్యత్తును నిర్మించుకునే స్వాతంత్ర్యంలేని పసితనం. నిర్వీర్యమవుతున్న యువతరం.

"మొన్ననేకదా గ్రీటింగ్ కార్డు పంపాం
నిన్ననే కదా ఫాదర్స్‌డేకి ఫ్లవర్ బుకే పంపాం
మళ్ళీ యిప్పుడు పేరెంట్స్‌డే అంటున్నారేమిటి"?

ఆపుత్రాగ్రహం ఎలా వుంటుంది? బలహీన పడ్తున్న కుటుంబ బంధాల పట్ల కవి ఆవేదన యిది.

యిప్పటివరకు లలితగీతాలు, ఉద్యమగీతాలు, వచన కవిత్వం, వ్యాసం, విశ్లేషణ, జీవితచరిత్ర, చరిత్ర మున్నగు ప్రక్రియల్లో 27 గ్రంథాలు ప్రచురిం చిన ఎస్వీ తన నాలుగు దశాబ్దాల సాహిత్య ప్రస్థానం లో 30కిపైగా సంకలనాలకు సంపాదకత్వం నెరిపారు.

"ఒంటరిగా ఒడ్డున నిలబడి చూస్తున్న నా కళ్ళకు
నది ఒక విషాదగీతంలా
విలాస సంగీతంలా వినబడుతున్నది
సమూహ దుఃఖాన్ని మోసుకెళ్తున్న
నిట్టూర్పుల ఊటలా కనబడ్తున్నది" వంటి కవిత్వ పంక్తులు కోకొల్లగా సాక్షాత్కరిస్తయి తాజా కవిత్వ పొత్తంలో.

రక్తపాత నగరంగా మారుతోన్న భాగ్యనగరాన్ని చూసి తల్లడిల్లిపోతాడు ఈ కవి. నేటి కుగ్రామాన్ని 'గ్లోబల్ విలేజ్'గా మన ముందు నిలబెడ్తాడు. ఒక కవితలో కృత్రిమంగా నవ్వడం "కష్టమే కదా!" అంటు తేల్చేస్తాడు.

ఒక నేరస్థుడికి బెయిల్ దొరకిందట, అతని అనుచరులు ఆడంబరంగా జరుపుకునే "ఊరేగింపు"ను దృశ్యమానం చేస్తాడు మరో కవితలో.

కాళోజీ, మఖ్దూం మొయినుద్దీన్, కామ్రేడ్ ఎన్.వెంకటేష్,ఆత్మీయ మిత్రుడు ఏనుగు పుల్లారెడ్డి గారలకు అక్షరనివాళి సమర్పిస్తు సృజించిన కవితలు కడు హృద్యంగా వున్నయి. నందిని సిధారెడ్డికి తెలుగు విశ్వ విద్యాలయ విశిష్ట పురస్కారం దక్కినప్పుడు తనకే వచ్చినంత సంబర పడిపోతాడు. ఆయన్ను 'సామ్యవాద స్వాప్నికుడు'గా కీర్తిస్తు అక్షర సింహాసనంపై ప్రతిష్ఠిస్తాడు.

వచనాన్ని కవిత్వం చేయడం ఎస్వీకి బాగా తెలుసు. అందుకే ఈ సంపుటిలోని కవితలన్నీ ఏకబిగిని చదివేలా చేస్తాయి. చక్కని అనుభూతిని కలిగిస్తయి. మీరూ చదవండి. నాతో ఏకీభవిస్తారు.

ఉద్యమం ఉద్యమమే(కవిత్వం)- ఎస్వీ సత్యనారాయణ.

ప్రతులకు: నవోదయ బుక్ హౌస్ (అన్ని బ్రాంచీలు), నవ తెలంగాణ బుక్‌హౌస్ (అన్ని బ్రాంచీలు), విశాలాంధ్ర బుక్‌హౌస్ (అన్ని బ్రాంచీలు) నవోదయ బుక్‌హౌస్ & ప్రధాన పుస్తక కేంద్రాలు

వెల: 100/-

"కన్నా బన్ను ప్రచురణలు"
సెల్: 9618032390



- రమణ వెలమకన్ని
సెల్: 9866015040

## క్వారంటైన్

దేశం లాక్‌డౌన్
ఆగింది మాత్రం
సామాన్యుని
బతుకు బండి
కరోనా
అంత కఠినమైందా !
ఇంటిల్లిపాదిని
ఒకచోట చేర్చిందిగా !
డాలర్ కలలు
కూలిపోతున్నాయి
అడుగులన్నీ
ఇప్పుడు భూమి మీదనే
ఇంటి చుట్టూ
అన్ని బంగళాలే
ఇక మనుషుల్ని
వెతుక్కోవాలి
అందరూ
దాన ధర్మాలు చేసేవాళ్ళే
ఊరంతా
సెల్‌ఫోన్ కెమరాలే
కరోనా నీకు కృతజ్ఞతలు !

అన్నీ
నిజాలెన్ని చూపించావో !
బడికి
ముందస్తు సెలవులు
ఇళ్ళలో
సీతాకోకల క్వారంటైన్

ప్రార్థనా మందిరాలన్నీ
'లాక్‌డౌన్'
దేవుళ్ళు
ఆసుపత్రుల్లో డాక్టర్లుగా
డాలర్ చిలకలు
పంజరంలో దాక్కున్నాయి
క్వారంటైన్‌లో
అగ్రరాజ్యం
మానవత్వమింకా
బతికే ఉంది
లాక్‌డౌన్‌లోనూ
డొక్కలాడుతున్నాయి
ఒంటరిగా ఉండటమంటే
నీవొక్కడివుండడం కాదు
నీవు

నీతో ఉండడం
ఊరిప్పుడు
ఉలిక్కిపడడం లేదు
కరోనా పుణ్యమా అని
అంతా ఊళ్ళోనే
ఎందుకన్ని
కెమెరాలు గుమిగూడాయి
ఎవరో
'సేవ' చేస్తున్నారు
తెల్లకోటుకు
చేతులెత్తి దండం
'కరోనా'పై
మీపోరు అసమానం
నగరం
నిద్రపోయి ఎన్నిరోజులైందో
లాక్‌డౌన్‌లోలంగ్స్ ఫ్రీ...



- వడ్డేపల్లి సంధ్య
70360 00123

కొలతలబద్ధ పైని అంకెలన్నీ
అట్టడుగు సున్నాతో పోల్చుకుని
పైన ఉంటాయి !
అక్కర పడినపుడల్లా
అడుగున తొక్కేసిన వాటిని
పక్కకు పిలుచుకొని/నిలుపుకొని
వాటి విలువలు మరెంతగానో
పెంచుకుంటాయి !!
-మునిమడుగుల రాజారావు.

## చరమ గీతం

కరుణ లేని కరోనాను
తరిమి కొట్టుదాం!
మన ప్రాణం జోలికొస్తె
మట్టు పెట్టుదాం!!

ఇంటిలోనె మనముంటు
ఒంటిగ పోరాడుదాం!
మనిషి మనిషినంటకుండ
ఏకాంతంగ గడుపుదాం!!

చేతులకు పదె పదె
శానిటైజర్ వాడుదాం!
మూతి చుట్టుమాస్కులను
మరవకుండ తొడుగుదాం!!
మన మనోబలం ముందు
దాని బలం బలాదూర్!
ఈ 'లాక్‌డౌన్' మందు వేస్తె
తోక ముడుచు నా బడాచోర్!!

ఎడం ఎడం నిలబడి
కడదాము దానిగోరి!
నియమాలను పాటిస్తె
ఖతమ్ దాని స్టోరీ!!

ప్రతిని బూని దానిని
ప్రతిఘటించుదాం!
మన ధైర్యం మన ఐక్యత
ప్రదర్శించుదాం!!



- డా॥ టీ. గౌరీశంకర్
సెల్:9440969130

## మూగవోయిన రాగసభలు!

ఘంటసాల గానాల పేరిట
గరిష్ఠ పురస్కారాల పేరిట
ఘనా ఘనంగా
గణగణ గంటలా మోగే
అనేక సమావేశాలతో సాగే
రాగ(గాన) సభలు మూగవోయాయి!
'కరోనా' కరవాలానికి జడిసి
కళా సంస్థలన్నీ మూర్ఛపోయాయి!

నానా నాటకాలతో
నవీన 'షార్ట్‌ఫిలింస్' హంగామాతో
సంగీత, నృత్యాలతో
సర్వదా సంబరాలతో
రంభలా నర్తించే 'రవీంద్రభారతి' కూడా
కుంభకర్ణుని సోదరిలా గాఢంగా
కునుకులు తీస్తోంది!
గత్యంతరం లేని
కవుల కళాకారుల అంతరంగం
గట్టెక్కే రోజుల కోసం
నిట్టూర్పులతో నిరీక్షిస్తోంది!

- డా॥ వడ్డేపల్లి కృష్ణ
సెల్: 9246541699

## విశిష్టాయుధం

కంటికి కనిపించని క్రిమి
కల్లోలం సృష్టిస్తున్నది
విడిగా ఏమీ చేయలేని కణం
నీలోకి దూరి నిన్ను పరిమార్చే
పరమాణువౌతున్నది
ఎందరు మేధావులకో అది
ఒక ప్రశ్నాస్త్రం
ఎరుక లేని చెయ్యి దొరికితే చాలు
ఎగబాకే విషబీజం
పురాణాల్లో విన్నాం మాయా యుద్ధం
కంటున్నామిప్పుడు కరోనా స్వైరవిహారం
మనిషి మనిషితో విడివడడమే
విషూచికి విరుగుడు
ఎడం పాటించడమే దానిపాలిటి
యముడు
నీ స్వగృహ పంజరావాసం
దానికి ఉపవాసం
మందుకు లొంగని మహమ్మారి
స్వీయనిర్బంధానికి దాసోహం
వసుధైక కుటుంబంలో ఇప్పుడు

రెండే జాతులు
కరోనా సహితులు కరోనా రహితులు
ధనం అధికారం వాదం మతోన్మాదం
అన్నీ ఇప్పుడు కుక్కిన పేనులు
చడీ చప్పుడులేని శుష్క ప్రియాలు
మనసు పొరలు విచ్చుకుంటున్నవి
మల్లెలవలె
మానవతా వసంతం వెల్లి విరుస్తున్నది
మరో ప్రపంచం వలె
పుడమి విలయం పురోహితమైంది
జగత్ప్రళయం జన హృదయ జ్ఞానోదయమైంది
నీ నిగ్రహానికి నికష ఈ విషమ ఘడియ
నీ కనువిప్పుల పడవ ఈ కరోనా కడవ
అది చెడుగుడు ఆడుతున్నది చూశావా
చూపించు నీ ప్రతాపం దానికి చిక్కకుండా
దానికి దొరకక పోవడమే
దాని ఓటమికి విశిష్టాయుధం.



-తుమ్మూరి రాంమోహన్ రావు
9701522234

## నేటి నిజాలు




## మనిషికి రెండు వైపులా..!?

ఆకలి తీరక ఒకడి ఆరాటం
తిన్నది అరిగేందుకు మరొకడి ఉబలాటం
జీవం తీసేందుకు ఒకడి అహంకారం
ప్రాణంకోసం ఇంకొకడి పోరాటం
చేసేటందుకు పనిలేక మరొకడి ఆవేదన
మానవ ఆలోచనల మధ్య సంఘర్షణ
అంతా సంక్షోభమయం
లోకమంతా సందిగ్ధ సమయం
అయినా రాజకీయాలే ఈ సమాజంలో
ఎటు పోతుంది ఈ మానవ ప్రపంచం?

వైరస్ సోకింది మనిషికా
మానవత్వానికా?
ఇప్పుడిక
శుభ్రపరచాల్సింది మన చేతుల్ని-
శరీరాన్ని కాదు
మలినమైన ఈ మానవ మస్తిష్కాల్ని
మనసుల్ని.



- సుధాశేఖర్
మిల్ వాకీ
+16306216815

## "చీకట్లో చిరుదీపం"

మాయదారి కరోనా...
మహమ్మారి కరోనా...
నీవు మమ్మల్నేమీ చెయ్యలేవు
కఠోర కరోనా

అమ్మ ఒడిలాంటి చల్లని ఇంటి
రక్షణ చక్రంలో
పదునయిన పరిశుభ్రతాస్త్రాలతో
నీతో యుద్ధం చేస్తున్నాం
విజయబావుటాని ఎగురవేస్తున్నాం
కులాసాగా తీరిక తాయిలాన్ని
చప్పరిస్తున్నాం.

ప్రపంచం మొత్తాన్ని గుత్తంగా పట్టుకొచ్చి
పదిలంగా గుమ్మంలో గుమ్మరించే
దినపత్రికల వార్తల వంటకాలను
ఆరారగా నంజుకుంటున్నాం.

రుచులన్నీ పోగేసి
ఆకలి భూతాన్ని హతమార్చే
ఇల్లాలి ప్రేమామృతంలో
తడిసి ముద్దవుతున్నాం.

చిలుకపలుకుల సీతాకోకలు
చుట్టుముట్టగా
బాల్య బొబ్బట్లని
ఇష్టంగా ఆరగిస్తున్నాం.

పెద్దతెర లేనిలోటును మరిపిస్తూ
ఆపాతమధురాలను
అవిరామంగా అందిస్తూ
బుల్లితెర ఒలికించే
నవరసాలను కళ్ళతో తాగేస్తున్నాం.

చరవాణి వీణతో బంధుమిత్రుల
అను'రాగ' బంధాలకు
అందమైన అల్లికలల్లుతున్నాం.

పురాతనంలోకి పారిపోయిన
పచ్చీసు అష్టాచెమ్మా
వైకుంఠపాళి వామనగుంటలు
మానట్టింట్లో ప్రేమగా
కొలువు తీర్చుకుంటున్నాం.

సాయంత్రం అలసిన దినకరుని
పశ్చిమాద్రికి పంపేసి
డాబాలను ఆటస్థలాలుగా
అలంకరిస్తున్నాం.

అధికారులిచ్చిన
లాక్డవున్ దండనను
దండలుగా ధరిస్తున్నాం.

ఓ పులిలాంటి కరోనా
నువ్వు మా ఇళ్ళకొస్తే
పిల్లిలా మ్యావు మ్యావు
అనాల్సిందే!!!.



– కోపూరి పుష్పాదేవి
సెల్:

## వలస బ్రతుకుల వెతలు

కరువు కమ్మేసి
ఉన్న ఊరిలో పనులు లేక
కడుపు కాల్చుకుంటూ బ్రతకలేక
పొట్ట చేత పట్టుకొని
కట్టు బట్టలతో
బ్రతుకుదామని పట్టణం
వచ్చిన వలస జీవులకు
నేడు ఎంత కష్టమో !
కనిపించని ఏదో
మహమ్మారి భూగోళ మంతా
కబళిస్తూ కనబడ్డ
మనిషినెల్లా కాటేస్తుంటే
తగిన మందులేక, దిక్కు తెలియక
దేశాలు, రాష్ట్రాలు, నగరాలు, వాడలు
అడ్డుగోడల్ని, ముళ్ళకంచెల్ని పాతి
తమ్ము తాము వెలివేసుకుంటుంటే
ఉన్నపళంగా అప్రకటిత
అంధకారాన్ని బ్రతుకుల్లో నింపితే
నిలువ నీడ లేక,
దొరికే కాసింత కూలి కూడా కరువై
కాలు కదపనివ్వని కర్ఫ్యూ లో
శోకతప్తులై తల్లడిల్లుతూ
నిద్రలేక, బుక్కెడు కూడు లేక
పట్టణపు జనారణ్యంలో
పలకరించే తోడు కానరాక
బిక్కు బిక్కు మంటూ
దిగాలుపడి ఉన్న
అమాయక జీవుల జీవనపు
చరిత్రకందని కథలెన్నో? కన్నీళ్ళెన్నో?
పాలకులకు, పత్రికలకు
బొమ్మల పెట్టెలకు అందని
వృధార్తుల యధార్థ జీవితాల
గతి ఏమిటో? గమనం ఎటువేపో?
అన్యాయపు లోకంలో
పురుగులకన్నా హీనంగా
బ్రతుకు భయంతో
ఆకలికి అలమటిస్తూ
ప్రాణాలను గుప్పిట దాచుకొని
రోజులు సాగ దీసే
దీనులకు, ఆర్తులకు
ఎంత కష్టం? ఎంత కష్టం?
కాపాడతారని నమ్మిన దేవుళ్ళందరూ
ఝడిసి దేవాలయాల్లో తలుపులు మూసి
దాక్కున్న నేటి కలి కాలంలో
మనుషిని మరో మనిషిని
చూస్తేనే చావు కళ కమ్మేసి
పక్కకు తప్పుకుంటున్న
వైచిత్రిలో ఉండలేక,
దిక్కుతోచక ఉన్న ఊరికి
భయంతో పరుగు పరుగున
తిరిగి పయన మవుదామంటే
కాలు కదపనివ్వని కర్ఫ్యూ లో
పట్టణపు జనారణ్యంలో
ఏమీ పాలుపోక ఉన్న
అమాయక జీవులకు
ఎంత కష్టం ? ఎంత ఘోరం ?
స్వంత ఊరి లో
కనిపెంచిన వారి చేరువలో
కలో గంజో తాగి
బ్రతుకుదామని కాలినడకన
మండుటెండలో మాడుతూ
తాచుపాము లాంటి రోడ్డు వెంట
వందల మైళ్లను దాటుతూ
బయలుదేరిన బడుగు జీవులను
అడుగు బయట పెట్టనివ్వని
ఈ కాళరాత్రుల కటకటాల
బ్రతుకు ఎంత నరకమో !



-డా. కె. దివాకర చారి
9391018972

## వాళ్ళను వెళ్లనీయండి

వాళ్ళను వెళ్ళనీయండి
సొంత గూటికి చేరనీయండి
వందల మైళ్ళ దూరాలును
కాలి నడకన ఛేదించిన వాళ్ళు
ఆకలి పేగులు మోస్తూ
లోకం చుట్టిన వాళ్ళు.
పుట్టిన ఊరు వెళ్లడం
ఓ ప్రహసనం కాదు
అందుకే!
వాళ్లకు కాస్త స్వేచ్ఛ ఇవ్వండి
సొంత గడ్డ మీద బతుకు
విరగ్గాసిన బువ్వ తోటేమి కాదు
తెంపుకు పుష్టిగా ఆరగించడానికి..
కాకపోతే అక్కడ
కన్నీళ్ళని తడిమే స్పర్శలుంటాయి
ఆపదలో వెన్నుతట్టే
బరోసాలుంటాయి
కష్టసుఖాల్లో తోడుండే
మమతలుంటాయి
అల్లుకుపోయిన అనుబంధాలుంటాయి
మనిషిగా చూసే మనసులుంటాయి
చచ్చి శవమైతే పాడె కట్టి మోసేందుకు
ఓ నాలుగు మనిషితనాలుంటాయి
వాళ్లకు తెలుసు...!
ఈ ఉదారత ఆపద ఒడ్డెక్కేంత వరకేననీ...
ప్రభుత్వాల సవతి ప్రేమలు
పాలకుల ఊకదంపుడు ముచ్చట్లు
వాళ్లకు ఇంకా బాగా తెలుసు...!!
అయినా....!
జీవితమే యుద్ధ క్షేత్రం చేసి
అడుగడుగునా పోరాటం చేస్తున్నోళ్లకు
చావును గూర్చిన భయమెక్కడిది
కరోనాతో కలవరపాటు ఎక్కడిది?
అందుకే
వాళ్ళ కోసం వాళ్ళను వెళ్ళనీయండి
వాళ్ళ బతుకేదో వాళ్ళు బతకనీయండి
(వలస కూలీలు ఇళ్లకు చేరలేని
దీనావస్థకు స్పందనగా....)



-కోడిగూటి తిరుపతి
9573929493

## ఎంత కష్టం! ఎంత కష్టం!

పొట్టకూటికి
పరుగులెత్తి
పట్టణాలకు
వలసలెత్తిన
పేద బ్రతుక్కి
ఎంత కష్టం!
ఎంత కష్టం!
నిలువనీడ కానరాక

పట్టెడన్నం నోచుకోక
సొమ్మసిల్లి తూలుతున్న
పేద బ్రతుక్కిఎంత కష్టం!
ఎంత కష్టం!

కడుపుమంటకు తాళలేక
బిచ్చమెత్తు వేళకాక
ఎంగిలాకులు నోటకరిచి
బ్రతుకు పోరులో ఓడుతున్న
పేద బ్రతుక్కి ఎంత కష్టం!
ఎంత కష్టం!

కన్నవూరు పిలుస్తుంటే
కంటిపాపను చంకబట్టి
సంచులన్ని చేతబూని
మూటముల్లె శిరమునెత్తి
మైళ్ళు మైళ్ళు నడుస్తున్న
పేద బ్రతుక్కి ఎంతకష్టం!
ఎంతకష్టం!

మండు వేసవి ఎండలోన
ఆకలాగ్నికి ఆహుతవుతూ
కళ్ళుబైర్లు క్రమ్ముతుంటే
నెర్రెలిచ్చిన కాళ్ళతోటి నడుస్తున్న
పేద బ్రతుక్కి ఎంతకష్టం!
ఎంతకష్టం!

-చందు తంగెళ్ళ
9121911742

## కరోనా జర మరోనా

కరోనా ఓ కరోనా
ఐసోలేషన్ గదులతో
అద్దాల మేడలు కట్టాము
నీ అంతమే జరగాలని
మా పంతమే నెగ్గాలని

దారి తప్పి వచ్చావో
దండించడానికి వచ్చావో
అణ్వాయుధాలు నచ్చక వచ్చావో
మా అభివృద్ధిని పరీక్షించ వచ్చావో
నీ ముందు మేము పిచ్చుకలమని
నిరూ పించ వచ్చావో
తెలువకుండా ఉంది
కరోనా జర నీవు మరోనా...

మందు లేని రోగాలంటే
పీడ కలలే వస్తున్నవి
కూలీ నాలీ జనమైనా
కుబేరుల ఇళ్లైనా
భయంతో చస్తున్నారు
కరోనా జర జావో నా.....

స్నేహ బంధపు తీపి గుర్తు
షేక్ హ్యాండును వద్దనుకుంటిమి
బయోమెట్రిక్ మూసివేసి
ముఖ ముద్రలే ముద్దనుకుంటిమి
కలియుగ కాలుష్యం
ఆధునిక క్రూరత్వం
నీకు నచ్చనట్లు ఉందని
మాకు మేమే మారుచున్నాము
కరోనా జర చోడోనా....

శాఖాహారం ఎక్కు వ తిని
మాంసాహారం తక్కువ తిని
ఇమ్యూనిటీ బలం పెంచుకొని
సురక్షితంగా బతుకాలని
షరతులు పెట్టుకున్నాం
కరోనా జర సునో నా....

ఆహారం కోసం దా డి చేసే
పులిని పట్టుకున్నాం గాని
నీవు దే ని కోసం
బాధ పెడుతున్నావో
టెక్నాలజీ అందుకోలేదు
అందుకే
సోషల్ డిస్టెన్స్ పెట్టి
మ నిషికి మనిషికి
దూరం జరిగినం
ఇగ నీకు మరణమే
శరణ్యం కరోనా.....

ఏదో ఒక రోజు
ప్లాస్టిక్ భూతం కూడా
నీ లాగే ఉంటుందని
ఇప్పటి నుండే మేల్కొం టున్నాము

సృష్టి రహస్యం
మనసుకు తట్టింది గాని
శివుని ఆజ్ఞలే
అర్థం కావడం లేదు

దేవుళ్లది ఒక విచిత్రం
మూగ నోము పట్టి
మునిగే దా క చూస్తారు
మనుషులే మారాలని
మంచితనం నటిస్తారు !
ఉన్నారో లేరో అని
సందేహాలకు ఘర్షణ పెడతా రు
అందుకే కరోనా
జర నీవు చావాలి
మానవాళి ని మన్నించాలి.



-జోగు అంజయ్య
8008957480.



## రైతుకు ఊపిరిపోద్దాం

ఒరుగుతున్న అరకను
ప్రకృతి బీభత్సానికి వాలుతున్న ఓదెను
మోసపోయి మరలా మరలా
మొలుస్తున్న తిండిగింజను
మధ్యదళారుల మాయాజూదంలో
మోసమోతున్న నిత్య ఓటమిని
పేరుకు అన్నదాతను
పకృతి శాపపు బ్రంహ్మరాతను
కరోనా కాలసర్పమై బుసలుకొట్టు వేళ
రవాణా సదుపాయం లేక
విరగ పూసిన పువ్వు తెల్లని నవ్వై
అడవి కాచిన వెన్నెలవుతున్నది
కాయలు నేలరాలి మట్టిరేణువులు ఎగిసి
మృత్యుబాణాలై
నా హృదయాన్ని చీల్చుతున్నాయి
కళ్ళంలోని పంటరాసుల కొండలు
అనకొండలై నన్ను మింగడానికి సిద్ధంగావున్నాయి
పొదుగు నుంచి జాలువారె శ్వేతామృతం
గమ్యానికి చేరలేక గరళమౌతున్నది
పండ్లు తమకుతామే పురుడుపోసుకొని
మొలకలకు జన్మనిస్తున్నాయి
కూరగాయలు కాలం కాటుకు వాడుతున్నాయి
అసత్య వార్తలు కోళ్ళరైతుల పాలిట
అశనిపాతమౌతున్నాయి
మూగజీవాలు డొక్కలు ఎండి
మృత్యుముంగిట నిలిచి రోదిస్తున్నాయి
భయం విసిరిన పంజరంలో అందరూ
బంధీలై బ్రతుకుతున్నారు
భయం చీకట్లు శాస్త్రజ్ఞుల ఆవిష్కరణల
సూర్యుడునుంచి వ్యాక్సిన్ వెలుగులు
ప్రసరించనంతవరకే
అప్పటి వరకు మనల్ని మనం రక్షించుకుంటూ
ఇతరులను రక్షిస్తూ
నాగరికత ప్రస్థానంలో మొట్టమొదటి
మజిలీ అయిన
వ్యవసాయాన్ని కాపాడుకుంటూ
రైతును బ్రతికిద్దాం

-చందు తంగెళ్ళ
9121911742

## నాటకమైతే బాగుండు!

మనకు తెలిసిన పాత సినిమాల్లోలా
బుర్రమీసాలు అడ్డపంచె నుదిటి గాటుతో
కండలు తిరిగిన పదిమంది అనుచరులతో
కంటికి ఇంపుగా ఉన్నవన్నీ కొల్లగొడుతూ
ప్రజల్ని ప్రకృతిని ఇబ్బందులపాల్జేస్తూ
పరులకేమైనా పర్వాలేదని ప్రతినాయక పాత్రలు
సరైన సమయంలో కథకు కథానాయకుడు
సన్నివేశంలోకి పరకాయ ప్రవేశంజేసి
కథానాయకీ నమ్మిన నలుగురు స్నేహితులతో
నమ్మలేనో నాటకాన్ని నమ్మేలా నడిపించి
ప్రతినాయకుల పాత్రల్ని నానా తిప్పలుపెట్టి
తప్పులు తెల్సొచ్చాయి కళ్ళు తెర్చుకున్నాయి
మహాప్రభో మమ్మీ విపత్తునుంచి విముక్తి
చేయమని
ఇట్టాంటి తప్పులింక చెయ్యమని లెంపలేసుకుంటే
కథాయకుడు నాలుగు చప్పట్లుబడే డైలాగుల్జెప్పి
నిజంజెప్పి నాటకానికి స్వస్తిజెప్పినట్టు
సృష్టికి హానిజేస్తూ ప్రతినాయకుడైన మనిషిని
కరోనా మహమ్మారితో హడలించి బెదిరించి
విశృంఖల చేష్టలతో విహారంజేస్తే
విపరీతమైన పరిణామాలు ఇల్లాగే ఉంటాయని
సృష్టి కథానాయకుడు దేవుడు వివరించి
వాస్తవ లఘుచిత్ర ప్రదర్శన చూసి
మానవాళికి కనువిప్పైందని నమ్మి
ప్రస్తుత పరిణామాల్ని ఉపసంహరిస్తే బాగుండు
ప్రాణాలొడ్డి ఊపిరిపోస్తున్న భూలోకదేవుళ్ళకు
కార్మిక కర్షక సోదరసోదరీమణులకు
ఇకనైనా విశ్రాంతి దొరికితే బాగుండు
మళ్ళీ మాళ్ళీ
ఇలాంటి విపత్తులు రాకుంటే బాగుండు
ఇట్టాంటి ప్రళయాలకి మనం కారకులం కాకపోతే
మనుషులు మళ్ళీ నిమ్మళంగా ఉంటే
ఎంత బాగుండో!

-రవి కిషోర్ పెంట్రాల

## కరోనా మొగ్గలు

మానవత్వానికి అసలైన చిరునామాలవుతూ
కరోనా కష్టకాలంలో ఆపన్నహస్తాలయ్యారు
కరోనా బాధితులకు ప్రాణం పోసిన వైద్యులు

నిరంతరం ప్రజలను కంటికి కాపలాగా కాస్తూనే
శాంతిభద్రతలను కాపాడే ధీరోదాత్తులయ్యారు
సమాజమంతటికీ రక్షణకవచాలు రక్షకభటులు

అపరిశుభ్రంగా ఉంటూనే అనారోగ్యాలపాలవుతూ
ప్రజల ఆరోగ్యాన్ని పరిశుభ్రంగా ఉంచేవారయ్యారు
శ్రమజీవనసౌందర్యానికి ఆనవాళ్లు పారిశుద్ధ్యకార్మికులు

కష్టకాలంలో నిరుపేదలకు అండగా ఉంటూనే
వారి కడుపుకింత అన్నంబెట్టే అన్నదాతలయ్యారు
కరోనా కాలంలో ఆపద్బాంధవులు ఆపన్నహస్తాలు

నిరంతరం ప్రజల బాగోగులను పర్యవేక్షిస్తూనే
వారి ఆరోగ్యంపై దృష్టి పెట్టిన రక్షకులయ్యారు
సమాజానికి దారిచూపే చుక్కానిలు నాయకులు



-డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017

## కరోనా నానీలు

నమస్కారం
ఇప్పుడు అనివార్యం
కరచాలనం
శకుని కుతంత్రం

కరోనా
గీత దాటుతోంది
గృహ నిర్బంధమే
ఇప్పుడు శ్రీరామరక్ష

వలస కూలీలు
విల విల లాడుతున్నారు
కరోనా
కబంధ హస్తాలలో

కరోనాకు
తట్టుకునేవి మొక్కలే
వాటికి
ఊపిరితిత్తులు లేవుగా!

ఇప్పుడందరూ
యుద్ధవీరులే
భౌతిక దూరమే
రణ తంత్రం

లాక్డౌన్ ఎత్తేస్తే
చంకలు గుద్దుకోకు
కరోనా
అవశేషాలుంటాయి

ఇప్పుడంతా
ప్రకృతి వికృతి
కరోనా
వింత ఋతువు రాకతో

కరోనా
అప్రకటిత యుద్ధం
ఇప్పుడు ప్రతి ఒక్కరు
సవ్యసాచి



-కయ్యూరు
బాలసుబ్రమణ్యం
944179139

## గృహహింస

ఎందుకురా నీకెందుకురా
సూటిపోటి మాటలంటావు
చీటికిమాటికి ఛీదరిస్తావు
క్షణం క్షణం కసురుకుంటావు

కాఫీలో, టీలో చెక్కర
తక్కువయినా, ఎక్కువయినా
చెంప పగలగొడతావు
పప్పులో, కూరలో ఉప్పు
తక్కవయినా, ఎక్కువయినా
ఉప్పెనలా మీదపడి దాడి చేస్తావు

కట్నం కోసం వేధింపులు
సరాతంతో వాతలు, దెబ్బలు
ఏ మగాడితో మాట్లాడిన
మండిపడతావు
ఎప్పుడు అనుమానాలే
ఆమెకు ఎప్పుడు అవమానాలే

వేలుపట్టి నడిచినందుకా
వేళ్లు విరిచేస్తావు
ఏడడుగులు నడిచినందుకా
ఏడు సముద్రాల నీళ్లు తాగిస్తావు
కన్న వారిని విడిచి
నీతో వస్తే ఆమెకు మిగిల్చేది
కన్నీళ్లు, కష్టాలు

ఆలి అంటే కంట్లో నలుసు కాదు
ఆలి అంటే అంగట్లో సరుకు కాదు
ఆలి అంటే ఆదిదైవం
ఆలి అంటే ఆదిశక్తి

ఆలిని హేళన చేయకు
ఆలిని ఆదరించు
ఆలికి ప్రేమను పంచు
ఆలి లేకుంటే నీ బతుకు
చిరిగినా విస్తరాకు వంటిది

ఎందుకురా నీకెందురా
ఈ వెకిలి చేష్టలు...
ఇకనైనా ఆపురా
నీ "గృహహింస "
(కరోనా కాలంలో పెరిగిన
గృహహింసలను వ్యతిరేకిస్తూ... )



-పి కుమార్
చరవాణి :8978631913.

## మనం తెలుసుకోవాలి

కనిపించక ప్రపంచాన్ని కాటువేసి నవ్వుతోంది
లోకం తో ఆటలాడి ప్రాణాలను తీస్తున్నది
విజ్ఞానపు ఘని ని ప్రశ్న బోనుల్లో నిలిపింది.
మృత్యువు గా ప్రపంచాన్ని కబళించి వేస్తున్నది
ప్రకృతితో ఆడినట్టి చెలగాటమె పరిణామం
విచ్చలవిడి తనం పెరిగిన ఈ పరిణామం
జ్ఞానం ప్రశ్న గా మారే దేవుళ్ళు మూగబోయే.

ఏమికాలమొచ్చింది ఎవరికి ఎవరూ రక్ష
ఎందుకిలా అయ్యింది కాపాడే వారెవరూ
ప్రపంచాన్నంత చూడు ఒక్క పురుగు శాశించే
మరణాలను రాసుకుంటు మనిషిని అంతం చేసే
ఏదీ బాధ్యత ఇప్పుడు ఏదీ కర్తవ్యమిపుడు
ఏదీ జ్ఞాన బోధ ఏదీ మన భవిత ఇపుడు
ఎవరు ఎవరినడగాలి ఏ దిక్కును చూడాలి

భూమి దద్దరిల్లలేదు ఆకాశం పగలలేదు
గ్రహ లేమి కూలలేదు గ్రహచారమే తప్ప
మనిషికి మనిషీ కాదు పురుగిప్పుడు శత్రువయ్యే
పక్షులన్ని హాయిగుండే ప్రాణులన్ని బాగుండే
మనిషి కొచ్చె బాదలిపుడు
గజ గజ వనికే జ్ఞానమిపుడు
ఈ ధనమూ ఐశ్వర్యం ఎవరికేమి ఇచ్చింది
ప్రకృతి కోపం ముందు ప్రశ్న గ నిలబెట్టింది
ఎదురుగ ప్రశ్నిప్పుడు ఎదురు నిలిచి అడుగుతోంది
జ్ఞానపు మనిషీ నిప్పుడు జవాబునే చెప్పమంది

ఎందుకీ కాలాలు ఎందుకీ కష్టాలు
ఏ మహిమలు పనిచేయుతే ఏ దైవం కరుణించలే
మనిషీ ఓ మనిషి ఎవరు నీకు తో డెవ్వరు
ఆలోచన చేసి చూడు వికృతయ్యి విడి పోకు
ప్రకృతమ్మ నడిగి చూడు ఏంత కీడు చేసావో

అడవులనూ తుంచావు పర్వతాలు పేల్చావు
చెట్లను నరికేశావు చెడు తో జీవించావు
సత్యమునొదిలేశావు పాపాలను మోశావు
అభివృద్ధి పేరుతోని అన్నీ వదిలేశావు
అస్తిత్వం మరిచిపోయి పతనాన్ని కోరావు
మనిషి విలువ గొప్పదంటు విర్రవీగి పోయావు

స్వార్థంతో బతికావు కష్టాలను పెంచావు
నేటి తోనే బతికావు భవిత గాంచలేదు నువ్వు
దైవ భీతి మరిచావు నేరాలతో ఆడావు
మంచిని తించేశావు మానవతను మింగావు
ప్రస్నలెన్ని ఎదురైనా నీ జవాబు వెతికావు
ప్రకృతి కళ్ళను మూసి వికృతి గా నిలిచావు
భూతాపం భూశాపం రోజు పెరిగి పోయినా
గుండెల్లో గుణాపాలను దించుకుంటు నవ్వావు
నిలబెట్టిన ఈ భూమిని అవిటిగా మార్చావు
గుండె మండుతున్న గాని మనసు కరగ లేదునీది

చేరుబుల్లన్ని ఎండిపోయి నదులన్నీ ఏడ్చినపుడు
చింతలేక అంతరించే మనిషి నవ్వుకున్నాడు
పురుగువచ్చి ముందునిలిచి ప్రశ్నలెన్నో అడుగుతుంటే
ముక్కు నోరు మూసుకుంటు గూటి లోన చేరాడు

ప్రకృతమ్మ శాపం గా పురుగులు పగబట్టాయి
మనిషి మదం అణిచివేయ చావు మేలమైనాయి
ఎంతటి ఆగ్రహమో ఇది కాలం గుర్తించింది
కాలం తో పాటు నడిచే మనిషీ గుర్తించాలి

మరణించే మనిషి నడుగు కాలమేమి చెప్పిందో
జీవించే ఆశనడుగు మరణమెందుకొచ్చిందని
పూడ్చిపెట్టె శవం ముందు పురుగు నాట్యమాడే చూడు
దరికొస్తే దారి నీకు స్మశానమే అంది నేడు

బంధుత్వం బాంధవ్యం ఏ పాటిది అనుబందం
దూరమయ్యి దూరమొంచి ఏమి సాధించాడు
జ్ఞానం తో శాశించి ఏమి మిగిలిచ్చాడు
కరోనా కాకపోతే ఇంకొక్క మరణా
మనిషి విర్రవీగినపుడు కాటు వేయు భరానా
పురుగులన్ని ఏకమయ్యి మనిషిని విడగొట్టే జామాన
వచ్చే ఉపద్రవమిది గుర్తించాలి జ్ఞాన ఖజానా

ప్రకృతమ్మ పిలుపు కొరకు అన్ని వదిలి వేయు మనిషి
బతుకు మనుగడ ప్రకృతి గూటిలోనే మనిషి
భవిత గాంచి ఓ మనిషీ వీడి పోకు అమ్మ ఒడిని
నాశనాన్ని కోరుకోకు మృత్యువు గా మారిపోకు



-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

## కరోనా చల్..జావోనా

విశ్వ వ్యాప్తంగా
విషజ్వాలలు కురిపిస్తూ
విజయకేతనం ఎగరేస్తూ సాగేవు
కరోనా చల్ .. జావోనా !

స్వార్థపూరిత సమాజంలో
మానవ విలువలు
ఇంకా బతికే ఉన్నాయని చాటేవు
కరోనా చల్.. జావోనా !
నీది నాది అంటూ విడదీసి
బతికేవాళ్ళకు చివరికి మిగిలేది
ఏదీ లేదని తెలిపావు
కరోనా చల్.. జావోనా !

భౌతిక దూరం పాటించకపోతే
లాక్ డౌన్ లో లేకపోతే
నీతో ఆలింగనం తప్పదన్నావు
కరోనా చల్.. జావోనా !

పేదవాళ్ల కడుపులు కొడుతూ
వికటాట్టహాసం చేస్తూ
విర్రవీగుతున్నావు
కరోనా చల్.. జావోనా !

మానని గాయాలపై కారం చల్లి
కొత్త గాయాలు పుట్టిస్తున్నావు
కరోనా చల్.. జావోనా !

కులం మతం పేద ధనిక తేడా లేదని
అందరికీ తాకుతూ సాగుతున్నావు
కరోనా చల్.. జావోనా !

శానిటైజర్ లు మాస్కులతో
జనావళిని బతుకమని
శాశిస్తున్నావు
కరోనా చల్.. జావోనా !



– చంచల రవి కుమార్
8500330700

పుస్తక సమీక్ష

# విశ్లేషాత్మకమైన "అక్షర కింకిణులు"

చరణ కింకిణులు ఘల్లు ఘల్లు మన్నట్లు మనో కింకిణులు కూడా తమ కలాన్ని ఆయుధంగా ఉపయోగించి చేసిన ధ్వనిని పోల్చి "అక్షర కింకిణులు" అనడం ఎస్.ఆర్.పృథ్వి సాహిత్య వ్యాసాలు యొక్క లోతును తెలియజేస్తుంది. అక్షరం ధ్వని చేయడం అంటే పదిమందికీ వినిపించడమే. అలా పదిమంది తలచుకునే కవుల్ని, వారి భావాల్ని తెలియజేయడం ఎంతో సముచితంగా ఉంది. తెలుగు కవిత్వంలో అమ్మ, రామాయణ కల్పవృక్షం, కందుకూరి గారి సరస్వతీ నారద విలాపము, కృష్ణశాస్త్రి కవితా వైభవం, గోదావరి పుష్కరాలు, గరిమెళ్ల వారి పాట, వేదుల సత్యనారాయణశాస్త్రి గారి గౌతమీ కోకిల, కసుపర్తి అబ్బయామాత్యుని కావ్యాలలో వర్ణనా వైభవం వంటి ఎంతో విలువైన గ్రంథాలను గురించిన వ్యాసాలు ఇప్పటికే కాదు ఎప్పటికీ ఉపయోగమే..






నాకు తెలిసి 'అమ్మ' పై కవిత్వం రాయని కవి మన తెలుగు సాహిత్యంలో లేరు. ప్రముఖ కవి డా॥ఎన్ గోపి గారు అన్నట్లు "అమ్మ" అనే పదమే ఒక కావ్యం అనేది ఎంతో వాస్తవం. అమ్మ పదానికే అంత విలువ ఉన్నప్పుడు అమ్మకు జీవితంలో ఎంత విలువుంటుంది? అనే విషయాన్ని కొంతమంది కవిత్వాన్ని తలుచుకోవడం ఎంతో బావుంది. అమ్మపై డా॥సి. నారాయణ రెడ్డి గారు రచించిన కవిత్వం నుండి, డా॥ ఎన్ గోపి గారు, బండారు జయశ్రీ, ఐతాచంద్రయ్య, గాజోజు నాగభూషణం, కోపూరి పుష్పాదేవి, రత్నమంజరి, దోర్నాదుల సుబ్బమ్మ, శ్రీలత వంటి వారి కవితా పంక్తుల్ని ఈ వ్యాసంలో సేకరించి రచించారు.

భారతీయులకు రామాయణ, భారత, భాగవ తాదులు, ప్రామాణిక గ్రంథాలు రామాయణాన్ని వ్రాసిన తొలివ్యక్తి వాల్మీకి మహాముని. కథని మొదటగా జనాలకు చేరువ చేసింది కుశలవులు. అనేక భాషల్లోకి అనువదించబడి పవిత్రంగా విరాజిల్లిన గ్రంథరాజం "రామాయణం" అనే సుస్థిరమైన అంశాన్ని విశ్వనాథవారి పద్య శిల్పం ద్వారా తెలియజేసిన వ్యాసం రామాయణ కల్పవృక్షం.

శతాధిక గ్రంథాలలో ఒకటైన సరస్వతీ నారద విలాపము – ఒక పరిశీలన అనేది 25 పద్యాలతో వెలువడిన చిరుకావ్యం. ఏకరంగ పద్యనాటికగా వ్రాయబడిన ఈ గ్రంథం హిందువులకు పూజనీయమైనది. సరస్వతీదేవి, నారదమహర్షి వంటి పాత్ర ల్లోని అనుబంధం, తల్లి బిడ్డల అనుబంధం తెలియజేసిన తీరును వర్ణించిన తీరు అద్భుతం.

తెలుగు సాహిత్యానికి మకుటాయమానం అయిన కృష్ణశాస్త్రి గారి కవితా వైభవం అంటే ఎవరికి ఇష్టం ఉండదు? **"నాకేల ఒక జోల/ నాలో అమృత వీణ/ ఉంచి నను లెమ్మందువా/ దేవ/ ఊరికే పొమ్మందువా!"** అంటున్న కృష్ణశాస్త్రి భావకవితోద్యమంలో ప్రముఖులు, కృష్ణశాస్త్రి గారి జీవన పథంలో అనేక శాఖలు నిర్దిష్టమైన రేఖలుగా విస్తరించడం పరిశీలించిన వారికెవరికైనా కనిపిస్తుంది. ఆ శాఖల్ని, రేఖల్ని విశదీకరించిన ఈ వ్యాసం అమృత తుల్యం. దక్షిణాన ప్రవహించే నదులలో గోదావరి ప్రముఖమైనది. ఆదికవి నన్నయ్య గోదావరిని దక్షిణ గంగ అని ప్రస్థావించారు. గౌతమ మహర్షి మహా తపస్సంపన్నుడు. దయార్ద్ర హృదయుడు ఆకలి వినిపించని ఈ ఆశ్రమంలో క్రూర జంతువులు సైతం సాదుతత్త్వంతో సంచరిస్తాయి. అంటూ గోదావరి నది ఈ భూమ్మీద ప్రవహించడానికి ఉన్న కథ నేపథ్యాన్ని తెలిపే వ్యాసం గోదావరి పుష్కరాలు.

క్రీ.శ 1730–1780 ప్రాంతంలో జీవించిన కనుపర్తి అబ్బయామాత్యుని కావ్యాలు అనిరుద్ధ చరిత్రము, రెండవ కావ్యం పూరూరవశ్చరిత్ర వంటి మహత్తర కావ్యాలలోని ఆంతర్యాన్ని తెలియజేసిన వ్యాసం కనుమర్తి అబ్బయామాత్యుని కావ్యాలలో వర్ణనా వైభవం వ్యాసం, చేబోలు చిన్మయబ్రహ్మ కవి గారి జ్ఞాపకాలు, స్వాతంత్రోద్యమంలో వాడపల్లి, పద్యాలకు కొత్త ఊసులు నేర్పిన చక్రాల వారు, స్వాతంత్ర సాధనకోసం కవుల కవాతు, గరిమెళ్లపాట వరద గోదావరి వంటి కావ్యాలను, విశేషాంశాలను విశదీకరించి వివరించిన ఈ వ్యాసాలు రాబోయే తరాలకు ఎంతో అవసరం. ఇంతటి విలువైన గ్రంథాన్ని వెలువరించిన కవి ఎస్.ఆర్. పృథ్వి గారికి అభినందనలు.

ప్రతులకు: పి. ఉషారాణి, ఫోన్ 9989223245

–శైలజామిత్ర
9290900879

పుస్తక సమీక్షలు

# సౌందర్య భరిత “వానచుక్క శతకము”




సృష్టిలో అనేక సౌందర్యాలున్నాయి. విరబూసిన పువ్వు, అరవిరిసిన నవ్వు, పండుటాకు, గాలికి రాలే పిందెలు, కురిసే వాన, మండువేసవి సాయంత్రం వంటికి తగిలే చల్లని గాలి ఇలా ఒక్కటేమిటి అనేకం ఉన్నాయి. అందులో వాన చుక్క ఒకటి. కవి హృదయానికి కదలని వస్తువు కూడా ఒక సౌందర్యమే.. ప్రతి క్షణాన్ని ఒక సుందర దృశ్యంలా చిత్రీకరించి, అక్షరీకరించే శక్తి ఒక్క కవికి మాత్రమే ఉంది. అలాగే వానచుక్క శతకము రచించిన కవి డా॥ కాసర్ల నరేశ్‌రావు ఎంతో సున్నితమైన విషయాలను సైతం ఒక కవిత్వీకరించి, శతకంలో ఒక మకుటంలా ఇమడ్చారు. వీరు రచించిన 116 శతకాలలో కొన్ని సామాజికమైనవి. కొన్ని వస్తు మకుటాయమైనవి, మరికొన్ని మనోహర దృశ్యాల్ని బంధించినవి ఉన్నాయి. కొన్ని ఉదాహరణలు..

సామాజికం: **“బిందెనీటి కొరకు వందల యుద్ధాలు/చేతురయ్య గాని చేతనొక్క**

**మొక్కపెట్టలేరు మ్రోడు మనుషులు చూడు/వానచుక్క నీకు వందనమ్ము!**

**“నేలమీద మనిషి కాలుష్యమును పెంచ/ గాలియిల్లు నీవు ఖాళి చేసి**

**మరలినావె యలుక మన్నించి మముజేరు/వానచుక్క నీకు వందనమ్ము”**

వస్తు ప్రాధాన్యం: **“పల్లికాయలెల్ల పఠియించె నీ పేరు/ ఒళ్ళు కాల్చుమంటు/ నొకటెగోల**

**జడములకును నీవు జవసత్త్వమొసగేటి/ వానచుక్క నీకు వందనమ్ము”**

**“కోడి కొందరికి పకోడి యందరికన / సర్వసౌమ్యమనెడు సమతగీతి**

**పాడినావు నీవు వేడి రాగమ్ముతో/ వానచుక్క నీకు వందనమ్ము**

దృశ్య ప్రాధాన్యం: **“కొలనులన్ని కనుల కొలనులందు మెరిసె/కలువలన్ని మనసు కలయబూ**

**నీవురాగ బ్రతుకు నీటి వరము నొందె/ వానచుక్క నీకు వందనమ్ము!**

**“ఎదురు చూపులన్ని మధురఫలములాయె/ చెదురు మనసు యిపుడె కుదుటపడెను**

**నీవు తాకగానే నేల మేమైతిమి/ వానచుక్క నీకు వందనమ్ము!”**

వంటి భావాలతో దాదాపుగా అన్నింటినీ వర్ణించగల, సమర్థవంతంగా స్పృశించగల సత్తువ ఈ కవికి ఉందని చెప్పవచ్చు. వానచుక్క అనేదే ఒక అద్భుతమైన భావం. ఆలోచన. నీటి బిందువుకు మించిన సౌందర్యం దేనికి ఉంది? ప్రకృతిలో అత్యంత సుందరమైన ఆకారాలు, దృశ్యాలు గమనిస్తేనే కనిపిస్తాయి. కొన్ని మనసును సేదదీర్చుతాయి. కాసర్ల నరేశ్ రావు తాను రచించిన ఈ శతకంలో ఎంతో ఆవేదన కనిపిస్తుంది. అందుకే ఈ శతకమంతా ఆర్ద్రతతో నిండి వుంది. సామాన్యుల జీవితాలకు సంబంధిం చిన సమస్యల్ని ఎంతో బాధ్యతా యు తంగా రచించి స్పందించారు. గుండె గాయాలు, కాగడా, కాలగంధం, లలిత తరంగాలు, కాలస్పర్శలతో పాటు మరో మంచి గ్రంథం “వానచుక్క శతకము” అందించి నందుకు అభినందిస్తున్నాను.

ప్రతులకు: కాసర్ల నరేశ్ రావు, ఫోన్: 9441406252

## హరివిల్లు

పేదలకు పెళ్లి భారము
పెరిగి పోతున్న ది
అప్పుల పాల్జేస్తున్నది
ప్రాణం తీస్తున్న ది

మానవ మనుగడకు
ప్రకృతి ఎంతో ముఖ్యము
చెట్లు గుట్టలు వాగులు
కాపాడాలి మనము

చెట్లు లేకపోతే
కురువవు వర్షాలు
పండవులే పంటలు
వస్తాయి కరువులు

నాటాలి మొక్కలు
పెంచాలి వృక్షాలు
అందించు వారసులకు
మధుర మైన ఫలాలు



-జాధవ్ పుండలిక్ రావు పాటిల్
సెల్ నెం.9441333315

# ప్రాచీన కథా పరిమళాలు “పరిసరాలు”

తెలంగాణలో కథా రచన మొదలైన రోజుల్లో అంటే 1940–50 ప్రాంతంలో వివిధ రచయితలు రచించిన 34 కథలను ఒక సంపుటిగా, 17 మరో సంపుటిగా వట్టికోట ఆళ్వారు స్వామి వెలువరించడం విదితమే. ఈ కథకుల్లో కాళోజి వంటి కవులు కూడా ఉండటం విశేషం. మన ముందు తరంలో అద్భుతమైన కథా రచయిత్రులు, రచయితలుగా ప్రసిద్ధి పొందిన సరమౌళి, ఇందిరాదేవి మొదలుకొని ఊటుకూరు రంగారావు వరకు మొత్తం 34 కథలున్నాయి. ఈ కథలు దాదాపుగా తెలంగాణ గ్రామీణ జీవితాన్ని చిత్రించేవే ఎక్కువగా ఉన్నాయి. వ్యంగ్యం, హాస్యం , అభ్యుదయం, సంస్కరణ , మానవీయత కూడా ప్రధానంగా కనిపిస్తాయి. కథ పుట్టినప్పటి నుండి కుటుంబంతో మొదలయి రైతుల జీవితాలు, ప్రభుత్వంలోని అవతకతవకలు, మానసిక చిత్తవృత్తులు, వివిధ ప్రవృత్తులు ఇతివృత్తాలుగా ఇప్పటివరకు అనేక కథాంశాలు వచ్చాయి. ఇవీ అంతే.. కాకుంటే “ఓల్డ్ ఈజ్ గోల్డ్” అన్న చందంగా ఇందులోని కథలన్నీ ఎంతో సంస్కారవంతంగా తీర్చిదిద్దబడ్డాయి. 34 మంది రచయితలు రచించిన కథలలో భాషలో వైవిధ్యం, ఏక సూత్రత ప్రధానాంశంగా కనిపిస్తుంది. ఈ కథలు సైతం కొత్తగా రాయాలనుకునే వారికి ఎంతో ఉపయోగపడుతుందనే ఆలోచనతో తెలంగాణ సాహిత్య అకాడమి నేడు ఒక గ్రంథంగా తీసుకురావడం, అందుకు ఎవ్వరూ ఊహించని




పేరు “పరిసరాలు” అని నిర్వచించడం ఎంతో కొత్తదనంగా ఉంది.

మల్లయ్య, పటేలు మధ్య జరిగిన పంటల జరుగుబాట్ల సంభాషణతో ప్రారంభమైన “అంగుడు పొద్దు” కథ ఖచ్చితమైన తెలంగాణ యాసలో సాగింది. తోటివారిని కించపరచడం పట్ల జరిగిన సంఘటనలు జీవితాల్ని ఎలా మార్చేస్తాయో తెలిపిన తీరు బాగుంది.

సంసారంలో మానవ సంబంధాలు సక్రమంగా ఉంటేనే జీవితం తిన్నా, తినకున్నా సంతోషంగా ఉంటుంది. అలా కాకుండా బలహీన క్షణాలో జీవితంలో ఎదురైతే ఇక ఆ జీవితం ఎక్కడో అప్పు తీసుకుని బతుకుతున్నట్లే ఉంటుందనే తీరులో సాగిన నందగిరి ఇందిరా దేవి కథ “ఏకాకి”చదువుతుంటే హృదయం బరువెక్కినట్ల యింది. ఈ సువిశాల ప్రపంచంలో ఎవరు ఏ నిముషంలో ఏమయిపోతారో అని తెలియజెప్పేకథ “ఏయిర్ మేల్” ఎంతో ఆర్ద్రంగా ఉంది. 34 కథ లున్న ఈ సంపుటిలో ఒక్కో కథా ఒక ఆణిముత్యం. కథ అంటే ఇలా ఉండాలా అనిపించేలా ఉన్నాయి. మేం నలుగురం, సర్కారు కిస్తు, హితోక్తి, సితార, లోతు తెలియని ప్రేమ, సుప్రభాతం, ప్రాణదత్త, రంగులంగయ్య, నాగి, తిరిగిరాను, ఓట్లకోసం, చీకటి గొడుగులు , పునర్జన్మ వంటి కథలు మళ్ళీ వస్తాయా ఇలాంటి కథలు అనిపించేలా ఉన్నాయి. కథ రాయాలనుకున్న ప్రతి ఒక్కరూ చదివి తీరాల్సిన కథలివి. సింగరాజు లింగమూర్తి రచించిన అశ్రుతర్పణం చదివాక ఇక మంచి కథకు ఇది చిరునామా అనిపించింది. అందరూ కొని చదవాల్సిన గ్రంథం ఇది. తెలంగాణ సాహిత్య అకాడమి వారు తెలుగు సాహిత్యం పట్ల చేస్తున్న వినూత్నమైన సేవకు జోహార్లు...

ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, రవీంద్రభారతి ప్రాంగణం ఫోన్: 29703142

–శైలజామిత్ర



## సైనికుని..మెరుపులు

మంచు కొండలే
వారి నివాసాలు
మన యోగక్షేమాలే
వారి ఆశయాలు !

అహర్నిశ కార్మికులై
నిత్యం శ్రమిస్తారు
దేశ పరిరక్షకులై
మనల్ని కాపాడుతారు !

నిత్యం శ్రామికులై
దేశసేవ చేస్తారు
వీర కిషోరులై
యుద్ధం చేస్తారు !

చల్లని కొండలే
వారికి వెచ్చనిశయనాలు
చొరబాటుదారులే
వారి లక్ష్యాలు !
సైనికుల పోరాటాలు
త్యాగ మయమైనవి
మానవుల ఆరాటాలు
స్వార్థ పూరితమైనవి !

వీర సైనికా
నీకు వందనం
మిత్ర రక్షకా
నీకు అభివందనం !

ఎవ్వరూ మరువరు
మీ త్యాగాలు
భవితలో చెప్పుకుంటారు
మీ ఘనకీర్తులు !

కన్నతల్లి రుణమే
వారి లక్ష్యం
దేశ క్షేమమే
వారి సౌభాగ్యం !
భరతమాత ముద్దుబిడ్డలై
బంధాలను రక్షిస్తారు
మృత్యుదేవత బందీలై
అమరులై నిలుస్తారు !

మృత్యువు కౌగిలించుకున్నా
వెనుకడుగు వేయరు
శత్రువులు చుట్టుముట్టినా
పట్టు వదలరు !

వారి త్యాగాలను
విలువ కట్టగలమా
వారి సాహసాలను
కించ పరచగలమా !

దేశాన్ని వంచించని
ఆదర్శప్రాయులు
ప్రాణాలను లెక్కచెయ్యని
మార్గదర్శకులు !

సమరానికి ముందుండే
దీరులు
దేశంతో కొనియాడబడే
శూరులు !
భారతదేశ కీర్తిని
వ్యాప్తి చేస్తారు
భారత పతాకాన్ని
భక్తితో పూజిస్తారు !

రీల్ హీరోలని
అభిమానించండి
రియల్ హీరోలని
పూజించండి !

తన కుటుంబానికి
దూరమై వస్తారు
భారతదేశ ప్రజలకి
సేవ చేస్తారు !

గుళ్ల వర్షం కురుస్తున్నా
గుండె అదరదు
ఫిరంగులు దూసుకొస్తున్నా
మనసు బెదరదు !

దేశ రహస్యాలను
మనసులో దాచుకుంటారు
పరాయి కుట్రలను
భగ్నం చేస్తారు !

నిద్ర కరువైనా
పహారా కాస్తారు
దాడులు ఎదురైనా
ముందడుగు వేస్తారు !

దేశాన్ని హెచ్చరిస్తే
అణుబాంబులై పోతారు
భారత్ను కించపరిస్తే
ఫిరంగులై పోతారు !

కంటికి కునుకు లేకుండా
కాపలా కాస్తారు
ఎవ్వరూ చొరబడకుండా
ఎదురుగా నిలుస్తారు !

ప్రాణాలను పణంగా పెట్టి
జాతిభవితను కాపాడుతారు
శత్రువులను కొల్లగొట్టి
జైహిందని పలుకుతారు !

అరాచక తీవ్రవాదులను
అణుగ తొక్కుతారు
శాంతి పరిరక్షణలను
నెలకొల్పుతారు !

కర్తవ్యాన్ని గుర్తుంచి
గమ్యాన్ని చేరుతారు
మూకలని గమనించి
మట్టుబెడతారు !

మన స్వేచ్ఛకి
మూలం వారే
మన కంటికి
వెలుగు వారే !

కన్నతల్లిని కాదనుకుని
కదలి వస్తారు
దేశభక్తి నింపుకుని
ధైర్యం గా నిలుస్తారు !

రక్షణారంగ వినీలాకాశంలో
ధ్రువతారాలై నిలిచారు
పహారా పూదోటలో
సుగంధ పుష్పాలయ్యారు !

శత్రువులకు భయపడని
శూరత్వం
ప్రాణభిక్షకి వెంపర్లాడని
వీరత్వం !

నాశనాన్ని తలపెట్టేతోల్లని
నలిపివేస్తారు
విధ్వంసం చేసేవాళ్ళని
వినాశనం చేస్తారు !

ఎముకలుకొరికే చలితో
దోస్తీ చేస్తారు
విదేశీ మూకలతో
కుస్తీ పడతారు !

విధి నిర్వహణలో
విధేయులై ఉంటారు
రక్షణ నిమగ్నంలో
జాగరూకులై ఉంటారు !

మేమున్నామని జాతికొరకు
హామీపత్రం ఇస్తారు
ప్రాణం పోయేంతవరకు
రక్షణగా నిలుస్తారు !

మూకదాడులను గుర్తిస్తూ
గమ్యాలను చేరుతారు
జయకేతనం ఎగరేస్తూ
వారితో పోరాడుతారు !

ఆకలితో అలమటించినా
దేశసేవ గుర్తొస్తుంది
హాహాకారాలు ఎన్నిచేసినా
దేశభక్తి వినిపిస్తుంది !

పొలిమేరలో పోటుగాళ్లను
పారద్రోలుతారు
కంచెదాటే కేటుగాళ్లను
కుళ్ళ బొడస్తారు !

మతాలకు అతీతంగా
కలిసి ఉంటారు
స్నేహ పూర్వకంగా
కలిసి పోరాడుతారు !

ప్రతిఇంట్లోని బిడ్డ
సైనికుడై కదలాలి
భారతదేశపు గడ్డ
వీరులతో నిండాలి !

నిప్పులుచెరిగే పోరాటాన్ని
అలవోకగా ఎదుర్కొంటారు
నివురుగప్పిన తీవ్రవాదాన్ని
నిలువెల్లా దహిస్తారు !

మారని గాయాలకు
మరువని త్యాగాలు
తిరిగిరాని లోకాలకు
తరలివెళ్లే అమరులు !

జవతత్వాలు కూడగట్టుకొని
జనంకొరకు పని చేస్తారు
జాతిజెండాను చేతబట్టుకుని
సగర్వంగా సెల్యూట్ చేస్తారు !
(03-05-20 న జరిగిన ఎన్ కౌంటర్ లో సైనికులు మృతి చెందిన సందర్భంగా)



– చంచల రవి కుమార్
8500330700



## అమ్మ ...

అపురూపమైన అద్భుతంగా
వెలసినది
మనలో అంతర్లీనంగా
నైపుణ్యాలను వెలికితీసింది..!

దారి చూపు
పెన్నిధి
ఆపన్న హస్తపు
అపూర్వ నిధి ..!

మన కష్టాలను
తనవే అనుకొనేది
మమత అనురాగాలను
మెండుగ పంచేది ..!

మనకోసం తల్లడిల్లు
ఏకైక మమత
మనతో పొదరిల్లు
నిర్మించుకున్న మాత ..!

వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్ది
ముందుకినడిపే గురువు
తప్పులు సరిదిద్ది
బంగారుబాటనిచ్చె గురువు..!

అత్యుత్తమ జీవితంలో
పయనింపజేసేది
అన్ని రంగాలలో
తోడై నిలిచేది ..!

నీడలా అనుక్షణము
వెన్నంటే ఉండేది
కష్టమొచ్చిన ప్రతిక్షణము
ఓదార్చేది ..!

మనలను నడిపించే
అమృతమూర్తి
నిస్వార్థంతో ప్రేమించే
అల్పసంతోషి త్యాగమూర్తి..!

అంతులేని ప్రేమను
గుప్పించేది
తన బాధను
మాత్రం పంచనిది..!

దైవానికి మారుపేరుగా
ప్రతిఇంట్లో ఉండేది
నిత్యం కోవెలగా
ఇంటిని మలిచేది..!

మనలోని బలహీనతలను
కప్పి ఉంచేది
అత్యుత్తమ బలవంతులుగా
చూపెట్టేది ..!

మాతృత్వపు మధురిమను
పంచేది
అనురాగపు ఊయలలో
ఓలలాడించేది ..!

మనం చెప్పకుండా
అవసరాలు గ్రహించేది
వెను వెంటనే
వాటిని తీర్చేది ..!

తప్పటడుగులు వేస్తే
మురిసిపోతుంది
తప్పులు చేస్తే
క్షమిస్తుంది..!

అలుపెరుగని అద్భుతమైన
మమకారం
బాధ్యత ఎరిగిన
అపురూపమైన బంధం..!

అమ్మతోనే అవని
పరిపూర్ణం అవుతుంది
ఆమె ఆగ్రహిస్తే
అంధకారం అవుతుంది..!

ఎంత చెప్పిన
తనివితీరనిది
అపురూపమైన
కావ్యం అమ్మ .!

ధైర్యం అనే
ఆయుధం అందించేది
సమాజపు యుద్ధంలోకి
పంపించేది ..!

నడక నేర్పించి
బంగారుబాటలు వేయించేది
మంచి నడతను
అలవర్చుకోమనేది ..!

నిద్రలోను నీకోసమే
కలలు కనేది
నీ అభ్యున్నతే
కోరుకునేది..!



– సునీత బండారు
9440671530

## వయసు మీరినా.. సొగసే!

ఆరు పదులదాకా అష్టకష్టాలు
సంపాదనకై ఆరాటం..
డబ్బు, కీర్తి, ప్రతిష్టలు.
కుటుంబ బరువు బాధ్యతల నడుమ
ఆనందానికై వెతుకులాట.
ఏడు పదులు చేరే వరకు
బరువైన అనుభవాల సంపద మోత.
‘పసి’ తరం.. ఆటలాడే వయసు
పసి(మి) ప్రాయం.. గత కాల పరవశం.
‘పండు’ తరం.. ఆటలుడిగిన వయసు
వర్తమాన వైరాగ్యం
ముడుతలు పడుతున్న దేహం
సమీపిస్తున్న ముసలితనం.
మోతాదుకు అటు ఇటు అయినా
తరగని జిహ్వ చాపల్యం.

లంకె బిందెల్లా వయసు అంకెలు
నూరుకు దగ్గరైనా..
చీకటి ఆకాశంలో పాలపుంతల
శతకోటి నక్షత్రాల సౌరు.
మనసున పూచిన బోసి నవ్వు
పెదాల విరిసిన చిరునవ్వు
వయసు మీరినా.. సొగసే!!



–ఆచార్య కడారు వీరారెడ్డి
సెల్: 9392447007

## భరతమాత సిగలో కలికితురాయి

ఎండ లేదు వాన లేదు
మంచు చలిలో గడ్డకట్టుకుపోయే కాయాలు
కొండలు కోనలే నివాస భవనాలు
తిండికొఱకు వెంపర్లాట లేదు
రుచులు మరచిన జిహ్వ
రాత్రి పగలు ఓకే తీరు
నిద్ర ఎరుగని కన్ను
ఎప్పుడూ డేగ చూపులే
సుఖం అంటే ఆమడ దూరం!!.
అన్నీ మరచి తనను తాను మరచి
భార్యాపిల్లలకు దూరమై
కన్నతల్లిదండ్రుల కన్నుల్లో వత్తులై
ఏమీ ఆశించని నిస్వార్థ జీవులు!!.
బ్రతుకంతా దేశం కోసమే
దేశం కోసమే జీవితం
దేశ రక్షణే ప్రధాన ధ్యేయం
పగవానికి చిక్కి శరీరం
గాయాల పాలై
కుళ్ల బొడుస్తున్నా
రహస్యాన్ని కాపాడిన వైనం!!.
ధైర్యం ఆతని సొత్తు
దేశ భద్రతే ఆతని ఎత్తు
ఉన్నత మహోన్నత శిఖరం
భారతావని సిగపూవులు వీర సైనికులు
భారతావని సిగలో కాంతులీనుతున్న
కలికితురాయిలు
అభినందనీయులే..!!



-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి
9490367383

## పౌర రక్షణలో ‘పంచ’ప్రాణాలు

అదిరి పడ్డ హంద్వారా అడవులు
నిశ్శబ్దాన్ని మింగెను తుపాకి తూటాలు
సగటు జీవులు ఉగ్ర చెరలో బిక్కిరిబిక్కిరి !

ఉన్మాదుల్ని మట్టుబెట్టే వీర సైనిక ‘శర్మ’లు
చీడపురుగుల్ని చెండాడే యువ’అనూజ్’లు
పౌర రక్షణే ఆశయ శ్వాసగా పోరాట పటిమలు !

ఉగ్ర కోరల్ని పీకి, తీవ్రవాదుల్ని తుదముట్టించి..
‘పంచ’ప్రాణాల్ని పణంగా పౌర రక్షణలు
మీ ప్రాణ త్యాగాలే మా జీవిత వెలుగులు !

మా మదిలో ధైర్యాన్ని , కన్నీళ్లలో కసిని..
రగిల్చెను మీ అసమాన అమరత్వాలు
భరతమాత నుదుట మీరే అరుణ సింధూరాలు !

మా ఇంటి దీపాలే కాదు గృహ పెద్దన్నలు మీరే
మీ స్ఫూర్తి జ్యోతుల వెలుగులో నిక్కంగా..
పది రెట్ల ప్రతీకారం తక్షణమే తీర్చుకుంటాం !

జై జవానంటూ జాతి పౌరుషాన్ని జాగృత పరిచి..
మీరు చూపిన త్యాగాల బాటలో ధీరులుగా నిలిచి..
ఉగ్రవాదులనే కాదు, ఉగ్రవాదాన్నీ తుదముట్టిస్తాం !

(జమ్మూ కాశ్మీర్ హంద్వారా ఘటనలో ప్రాణాలర్పించిన వీర జవానులకు కవితా నివాళి)



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## నానోలు

కుంకుమ
సౌభాగ్యం
చందనం
పరిమళం

పువ్వు
పుప్పొడి
తుమ్మెద
మకరందం

పెళ్లి
ఆహ్వానం
అక్షింతలు.
ఆశీర్వాదం

తపస్సు
మోక్షం
పూజ
పుణ్యం

అర్చన
హారతి
శఠగోపం
తీర్థం

కోయిల
గానం
మయూరం
నాట్యం

గురువు
బడి
విద్యార్థి
చదువు

ధావాఖాన
వైద్యుడు
రోగి
జబ్బు

యోగ
ఏకాగ్రత
వ్యాయామం
సౌష్టవం

శిలా
శిల్పి
ఉలి
సుత్తి

సంగీతం
బాణి
గానం
శృతి

క్షీరసముద్రం
మదనం
విషం
అమృతం

గుడి
ప్రదక్షణం
ముక్కు
ఫలం

నారికేళం
తీర్థం
ప్రసాదం
బిక్ష

బాణం
అమ్ములపొది
కత్తి
కరవాలాలు

రైతు
హలం
సేద్యం
కృషి

–చాపలమహేందర్
9949864152

## జోహార్ ఇర్ఫాన్

విలక్షణ నయన నటుడు
బాలివుడ్ హాలీవుడ్ నేలిన
నట శ్రేష్ఠుడు ఇర్ఫాన్ ఖాన్
ఇక లేరు ఇది చేదు నిజం
రాజస్థాన్ పఠాన్ వంశ
కుమార మధ్యముడు ఇర్ఫాన్
బాల్యంలో మితభాషి సిగ్గరి
తన స్వప్న సాకారానికై
రేయింబవళ్ళు కష్టపడ్డ శ్రామికుడు
విద్యాభ్యాసానంతరం భుక్తి కొరకే
కష్టపడటం ఇష్టం లేక తన
లక్ష్యసాధన దిశగా సాగి
డిల్లీ స్కూల్ ఆఫ్ డ్రామలో
తర్ఫీదు పొంది బుల్లి తెరపై నటించి
తన అదృష్టాన్ని వెతుకుతూ
ముంబాయి వెళ్ళి సలాంబాంబే
వంటి చిన్న చిత్రాలనుండి
స్లమ్ డాగ్ మిలియనీర్ వరకు
ది వారియర్ లైఫ్ ఆఫ్ పై
వంటి ఇంగ్లీష్ మూవీలవరకు
పాన్ సింగ్ తోమర్ హింది మీడియం
వరకు తన కనుదోయితోకట్టిపడేసే
నటనా చాతుర్యం అతని సొంతం
యావత్ప్రపంచం ఎన్నటికి మరచిపోదు
తన ప్రియసఖి సుతాప కొరకు
తన మతాన్ని సైతం
త్యజించటానికి సిద్ధపడ్డ సాహసి
ఎన్నో అవార్డులు అతని సొంతం
పద్మశ్రీ ఫిలింఫేర్ బెస్ట్ యాక్టర్
ఎంతటి వాడైనా విధిరాతకు తల
వంచాల్సిందే క్యాన్సర్ కబళించగ
సినీ జగత్తును వీడిన సితార
అందరి గుండెల్లో అజరామరుడే
రెస్ట్ ఇన్ పీస్
ఇర్ఫాన్ నీకు జోహార్



–సంధ్య సుత్రావె
9177615967

## ఆనందాల పొదరిల్లు.. !

మనసుకానందం నవ్వు
మదికిసంతోషం రువ్వు
నవ్వుల తోడి జీవితం..
నంది వర్ధనమౌ పువ్వు !

కల్మషాల బాపు నవ్వు
బుద్ధి వికాసమే రువ్వు
అనుదినంబు నవ్వేనవ్వు
ఆరోగ్యపు మల్లెపువ్వు!

నవ్వడమొక జ్ఞాన ఉషస్సు
నవ్వించడమేను తపస్సు
గలగల నవ్వే మనుషులకు
తొణికిస లాడులె తేజస్సు !

మనసారాగా నవ్వండి
నిష్కల్మషాలకు పువ్వండి
నవ్వించడముమహాయోగము
కడు నవ్వండి నవ్వించండి!

మధుర హాస్యరసం నవ్వు
అధరాభరణ చిరు పువ్వు
ముసి ముసిగ నవ్వే మనము
హృదయ స్పందనలు రువ్వు!

ఆనందాల హరివిల్లు
అభిమానాలవిరిజల్లు
నవ్వు లేను నజరానా
సంతోషాలకు పొదరిల్లు!!



–గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

## ఆరిపోయిన ప్రేమ దీపం...!

ప్రేమ కోసం
కన్న ప్రేమను వదిలి
కులం సంకెళ్ళు తెంచి
ప్రేమను గెలిపించిన మమత
వెళ్లి పోయింది
నిర్లక్ష్యపు వైద్యానికి
బలైపోయింది....!

మాతృత్వపు వాంఛ
తీరకుండానే
కలలు కలలుగానే మిగిల్చి
నిర్లక్ష్య వైద్యానికి ప్రతికగా నిలిచి
సెలవంటు వెళ్లిపోయింది.....!

భర్తతో చేసిన బాసలు
తీరకుండానే
మమతలు పంచే
ప్రేమదీపం ఆరిపోయింది
కన్నీటిని రాల్చుకుంటు
డాక్టర్ల ధనదాహాన్ని ప్రశ్నిస్తూ
వెళ్లిపోయింది....!

కులాలు మతాలు
ప్రేమను ఆపలేవని
మానవత్వం పరిమళించలని
లోకం ప్రేమతో నిండాలని
మమతలు కురిపించాలని
తన వాణిని వినిపించి
ఆరని జ్యోతిగా వెలగడానికి
వెళ్లిపోయింది.....!
–(నిర్లక్ష్యపు వైద్యానికి
ఆరిన ప్రేమ దీపం
వార్త చదివి)



–మొగిలి శ్రీనివాసు
9491746700

## పొడవని పొద్దు

ఆకలిని చేత బట్టుకొని
రేయింబవళ్ళూ కష్టానికి
ఎదురెళ్లుతారు వారు
మండే ఎండైనా వణికించే చలిలోనైనా
చెమట చుక్కల్ని చిందిస్తారు
శ్రమ తగిలితే తప్ప
శరీరానికి సుఖం రాదని తలచే
ఏకైక శ్రామికుడు అతను
కర్మాగారాల్లో నిప్పులు గక్కే
నిత్య సూర్యుడు అతను
ఆరుగాలం తన స్వేదంతో
మట్టి తల్లిని తన నుదుటికి అద్దుకొంటున్న
మహాజనుడు అతను

దేహాలకు అందమైన దుస్తుల్ని దరింపజేస్తూ
తన బతుకుల్లో దర్జా లేని దర్జీ అతను
చాకిరేవులో అన్ని మురికి మరకల్ని పోగొట్టి
తన ఆకలి మరకల్ని రుద్దుకోలేని
నిస్సహాయుడు అతను
తన నైపుణ్యంతో దేహానికి రంగులు అద్ది
మగ్గంలో మగ్గుతూ రంగుల కలలు లేని నేతన్న అతను
బ్రతుకు పోరాటంలో
ఇటుకబట్టీ అయినా ఇసుక క్వారీ అయినా

రాళ్లగుట్టలైనా రంపపుకోతలైనా
లెక్కకు మించిన పనిగంటల్ని జయించాల్సిందే
దేహం అలిసిపోయినా ...
దీనంగా వెట్టిచాకిరీ చేయాల్సిందే
తన హక్కుల్ని కాలరాస్తున్న
పాలకులకు సలామ్ కొట్టాల్సిందే
కొండల్ని పిండిచేసి కండలు కరిగిపోతున్నా
కాలమేదీ కలిసిరాక
కాలచక్రంలో కలిసిపోవాల్సిందే
కర్షకుని కార్మికుని బాగుకోసం
ఇంకా పొడవని పొద్దుకోసం
ఎదురుచూడాల్సిందే



– మహబూబ్ బాషా చిల్లెం
9502000415

# త్రిపద విరులు



-గద్వాల సోమన్న
సెల్ నెం:9966414580

అమ్మ మాట చల్లన
హిమగిరి మంచు వోలె
మల్లె లాగ తెల్లన
తల్లి మనసు చంద్రిక
శుభములు మిగుల తెచ్చును
తావి ఒసగు మల్లిక
నాన్న మదియే వెన్న
పూవు వలెను అందము
పసిడి కన్నా మిన్న
దారి చూపు గురువు
నింపు మదిని జ్ఞానంతో
శ్రాన్తి దీర్చు తరువు
అజ్ఞానము వద్దు వద్దు
తరిమితరిమి కొట్టుము
విజ్ఞానము ముద్దుముద్దు
చేయొద్దు ఎవరికి కీడు
చేతనైన మేలు కోరు
మంచిని పంచి చూడు
తరువులు ప్రగతికి బాటలు
నరికి ఎడారి చేయకు
మనిషి మనుగడకు కోటలు
చిన్నచిన్న బాలలు
భావి తరపు పౌరులు
కాంతి పంచు భానులు
మదిని దోచు బాలలు
ముద్దుముద్దు పలుకులు
అవే తేనె చినుకులు
నీటి మీద రాతలు
మాట తప్పు మనుష్యులు
నమ్మవద్దు అట్టి కోతలు
భువిని అదృష్టం బాలిక
అశ్రద్ధ అసలు చేయకు
ఆమె అగును ఏలిక
ఇంటికి బాలిక దీవెన
నట్టింట తిరిగిన మేలు
ఆమె పలుకులు తీయన
ఇంట ఉండాలి బాలిక
వచ్చును తప్పక అందం
దేవుని వెలగల కానుక
భువిని పెంచు మెండుగ
చెట్లు ఉంటే భవిత
తెచ్చు మదిని పండుగ
లేవాలి నిద్ర యువత
కావాలి నేడు యువశక్తి
వారే కదా భవిత
మానుము హృదిని చింత
అదే ఆహుతి చేయును
చేరకు దాని చెంత
ఖతం చేయును అహము
మదిని నుంచి తరిమివేయి
ప్రగతికి అడ్డం నిజము

కరోనా వైరస్ చూడు
బయట తిరిగి బలికాకు
నాట్యం చేస్తుంది నేడు
బద్ధకం ఇక వీడు
ఎక్కువైన వచ్చును కీడు
బ్రతుకు అగును మోడు
మొక్కలు మెండుగ నాటు
అవే నిన్ను కాపాడును
మదిని ఇవ్వు చోటు
వినుము మంచి పలుకులు
దిద్దుము చెడిన నడతలు
విడువుము చెడ్డ బుద్ధులు
తెచ్చును ఇంటికి ఖ్యాతి
సుబుద్ధి గల నాతి
వెలుగు పంచు జ్యోతి
మనసును చేయి అదుపు
లేకున్న తెచ్చును చేటు
అదుపు ఉంటే గెలుపు
చెలిమిని వమ్ము చేయకు
పసిడి కన్న విలువైనది
దానికి మచ్చ పడనీకు
మనసు మమతల కోట
దాన్ని శుచిగా ఉంచుము
అగును సేదదీర్చు తోట
మకిలి వాక్కులు ముల్లు
శుద్ధి చేసిన మేలు
లేకున్న గుండెకు చిల్లు
బాలిక ఇంట తార
తెచ్చి పెట్టును కీర్తి
పలుకు తీయని ధార
మంచి పనులు చూడు
దీవెన ఇచ్చును బ్రతుకున
చెడ్డ పనులు కీడు
ఉండాలి బ్రతుకున ఓర్పు
లేకున్న ఉండదు వృద్ధి
ఓర్పు తెచ్చును మార్పు
ఇంట ఉండుట మేలు
బయట తిరిగిన చేటు
కరోనా కదా తేలు
మొదటి గురువు అమ్మ
అన్నీ తానై నేర్పును
ఇంట అనురాగపు కొమ్మ
అమ్మ లేని సదనం
చూడ నొల్లని పాలిన
కాంతి లేని వదనం
అమ్మ త్యాగం గొప్పది
చూపు ప్రేమ విలువైనది
దేనితో అది కొనలేనిది
అమ్మ వెలగల వరము
ఆమె అపురూపం అవని
వర్ణించ ఎవరి తరము?

ప్రేమ అంటే తల్లి
ఇంటికి తరగని ధననిధి
పరిమళం ఇచ్చు మల్లి
మమతలు పంచే దాత
ఇంట అమ్మ మకుటం
శాంతి పెంచే దూత
అమ్మ భువిని వెలుగు
సృష్టికి ఆమె మూలం
అవని వృద్ధి కలుగు

జ్యోతి ఇంట ఇల్లాలు
కుటుంబ ప్రగతికి వారధి
ఖ్యాతి తెచ్చు మగనాలు
పాప మహిలో వేడుక
గృహమున మిగుల దీవెన
దేవుని గొప్ప కానుక

పెంచు ఇలను తరువులు
వృద్ధి అగును ధాత్రి
నిలుపును మనిషి అసువులు
నాన్న కుటుంబాన కొండ
సదా శ్రమించు త్యాగశీలి
ఇంటిలో గొప్ప అండ

ఇంట ఉంటే క్షేమము
కరోనా నుంచి రక్షణ
బయట తిరిగిన క్షామము
పల్లె ప్రజల గడియారం
పాతాలు కోడి నేర్పును
చేయు ఇలను ఉపకారం

రుచిని పెంచును ఉప్పు
అది ఉండాలి తప్పక
లేకున్న చప్పున పప్పు
దేవుడు గొప్ప శక్తి
చేరి సదా కొలువుము
చూపుము అసలైన భక్తి
దిద్దుకో జరిగిన తప్పు
అది ఎంతైనా మంచిది
దొరుకుతుందిలను మెప్పు

గొప్పది నిజమైన చెలిమి
అది పవిత్రమైన వరము
బ్రతుకున తరగని కలిమి
పూలు ఇచ్చే తావి
మనిషి చేయు మేలు
తీపి ఊట బావి
బడి పవిత్రమైన గుడి
దీవెనలకు అదే నిధి
పసిమొలకల పచ్చని మడి
వట్టి మాట చేటు
గట్టి మాట మేలు
మనిషి విలువ చాటు
అమ్మకు వెలగల ఓటు
అది రాజ్యాంగపు హక్కు
చూడకు పచ్చని నోటు
వృథా చేయకు నీరు
పొదుపు చేస్తే మంచిది
అందరి క్షేమం కోరు
చేయొద్దు గుట్టు రట్టు
మనిషి విలువ తగ్గును
సభ్యత కాస్త చూపెట్టు
ఊరట పంచు తోట
మృదువైన మనము పలుకు
విలువైన మాట నోట
తగినంత ఆశ మేలు
ఎనలేని తృప్తి నొసంగు
జీవితాన అదే చాలు
మనిషి భవిత చదువు
గొప్ప స్థానం ఇచ్చును
ఇదే ఆర్యుల నుడువు
వేయకు పరులపై నింద
అది ప్రమాదం తెలుసా?
వేయు వాడు పిరికిపంద
దాగి ఉండు ఇంట
కరోనా వైరస్ చూడు
రేపుతోంది ఎదను మంట
తీపి జలముల ఊట
అయి ఉండాలి అనిశం
అదే రక్షణ కోట
మకిలి మాట తూటా
మంచి మాట కోట
బ్రతుకున విజయ బావుటా
వద్దు వద్దు వృథా
ముద్దు ముద్దు ఆదా
అదే రక్ష సదా
మోసపు మాట వాడి
మానిన జరుగును శుభం
లేకున్న చేయును దాడి
ఇంటి యందు పోరు
చెప్పు నలివి కానిది
అది సంద్రపు హోరు

అదుపు చేయి ఆశ
బ్రతుకు అగును స్వర్గం
అత్యాశ అవును శ్వాస
హాయి ఇచ్చే తలగడ
కట్టడి చేస్తే మనసును
సుఖమయం మనిషి మనుగడ
చెట్టు జగతి నీడ
ప్రగతికి అదే పట్టుకొమ్మ
భువికి రక్షణ గోడ
తెలుగు మాట నుడువుము
తెలుగు తేనెలా తీయన
తెలుగు వృద్ధికి నిలువుము
గురువు మాట మోదము
మంచి దారి నడుపును
వినకున్న కలుగు ఖేదము
ఈర్ష్య చెడ్డ రోత
వాత పెట్టును బ్రతుకున
చేయు గుండె కోత
సుబుద్ధి గల సతి
దొరికిన ఇంటికి మేలు
సుఖపడును బ్రతుకున పతి
బద్ధకం కడు వ్యర్థం
అట్టి బ్రతకున ఉండదు
కదా అసలు అర్థం
గురువు పంచు జ్ఞానము
చూపు మిగుల గౌరవం
ఇలను వారు దైవము
పోరాట యోధులు అలలు
జీవిత సత్యాలు నేర్పు
సాకారం చేయి కలలు
ఇంటి యందు పిల్లలు
ఉంటే మోదము విరియును
వారు కదా వేల్పులు
బాలలు ఇంటికి అందం
మిలమిల మెరిసే తారలు
సుగంధం వారు బంధం
మంచి దారి చూపాలి
చెప్పాలి పొదుపు విలువ
బాలల భవిత దిద్దాలి
మరవకు ఇంటి బాధ్యత
గెలవాలి ఇంట మొదట
సాధించు తొలుత యోగ్యత
చూడకు ఎవరిని చులకన
అందరు దేవుని రూపులు
చేయకు ఎప్పుడు హేళన
చూపాలి కాస్త ఓర్పు
ఓర్పు ఉన్న విజయం
తెచ్చును క్రొత్త మార్పు
మహా జ్ఞాని దైవము
కొలువుము మదిని సదా
పెరుగును మనిషి జీవము

## ఓ కలియుగ కీచకులారా..

ఓ కలియుగ కీచకులారా
నేటినుండైనా మృగాలుగా ప్రవర్తించడం
మానుకోండిరా
మానవవులుగా మసలుకోండిరా
మీ
ఇంటిలో యున్న అక్కా చెల్లెండ్ల, అమ్మావదినల
మాదిరిగా
ఇంటి బయట స్త్రీలను కూడా
ఆదరించండిరా.. ॥ ఓ కలి॥
అవనిలో ఆడవారై పుట్టుట నేరమా
అందంగా పుట్టడం మరీ నేరమా..?
చుక్కలా వెలుగొందాలని
పగలనక, రేయనక
పట్టి పట్టి చదివి పట్టా పుచ్చుకుని
ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి
పనిచెయ్యడానికి ప్రయాణమయితే
రేసుకుక్కల్లా వెంటబడి
కొరికి, నరికి కాల్చి వేసితిరి
మీకు చిన్నముల్లు కుచ్చితేనే
విల విలకొట్టుకొనుచూ
ఎక్కి ఎక్కి ఏడుస్తారు
అందరి ప్రాణాలు అలా కాదారా..?
ఆడవాళ్ళంటే ఆట వస్తువులు కాదురా
ఆడవాల్లంటే వంటింటి కుందేల్ల అసలే కాదురా..
ఆడవాల్లంటే అందరి పుట్టుకకు కారకులు
ఆడవాల్లంటే ఆరాధ్య దైవాలు..



– సిరిగాద శంకర్
సెల్: 9493301985

## పల్లె పిలుస్తోంది

పల్లెకు పోదామా
మన పల్లె కు పోదామా
పట్నం లో ఏమున్నది
మన పల్లెటూరు పోదామా.

ఉద్యోగం సద్యోగం
కూలీ నాలీ అంటూ
పల్లె వదిలి వచ్చాము
పదరాని పాట్లుపడుతున్నాము.

ఇరుకిరుకు ఇళ్ళల్లో
సందు గొందు వీధుల్లో
వేలకు వేలు కిరాయిగట్టి
చాలీ చాలని జీతాలు తెచ్చి
అదనంగా అప్పుతెచ్చి
ఎలా బతుకుదాం మనము
ఈ వలస బతుకు లేంది మనకు.

చదువు సంధ్యా అంటూ
పిల్లల బాగోగులు అంటూ
మనవాళ్ళను వదిలొచ్చాము
ఈడ ఏమి సాధించినాము.

నిత్యం రద్దీ రోడ్లు
ఎవరికి వారే తీరులు
పొగబట్టిన పట్నం లో
ఊపిరి ఆడదు మనకు
పల్లేగాలి పిలుస్తోంది
మన పల్లెటూరు పోదామా

మేడలు మిద్దెలు పెరిగి
జనమంతా వచ్చి పడి
చెరువులు కబ్జాలు జరిగి
నీళ్లన్నీ అడుగంటే
ఈ తన్నులాట మనకెందుకు
మన పల్లెటూరు పోదామా.

కష్టము సుఖము వస్తే
పలకరించ దిక్కూ లేదు
పట్నం లో ప్రతి వారు
గజి బిజిగా బతుకుతారు.

కుల మత భేధాలు లేక
అందరూ నావాల్లంటు
వరస కలిపి మనసు కలిపే
పల్లేజనం పిలుస్తున్నారు
మన పల్లెటూరు పోదామా.

పల్లె విడిచి పట్నానికి
మనం పరుగులు పెడుతూ ఉంటే
వ్యవసాయ భూములన్నీ
దోపిడీకి గురవుతూ ఉంటే
భూమి తల్లి మనకోసం
కన్నీరే పెడుతున్నదిరో..
మన ఊరెళ్ళి పోదామురో..

వాడిపోయిన కూరలు,కాయలకు రెక్కలొచ్చిన
ఆ ధరలు చూసి
భయ పడుతూ లెక్కలేల
మన పల్లెటూరు పోదామా..
మన తోట పంట తిందామా..

పల్లెలకు పోయి మనం
వ్యవసాయం చేద్దామా
వారసత్వ కళలెన్నో కాపాడుకుందామా
సర్కారీ బదులను బాగుచేయ కృషి చేద్దామా
పల్లె కళకు కొత్త రూపు తెచ్చి
అభివృద్ధిని సాదిద్దామా

వాహనాల మోతలతో
చెవులకు చిల్లులు పడి
తలనొప్పే పెరిగేనులే
రోగాలే వచ్చును లే
పల్లె జాన పదం పిలుస్తోంది
మన పల్లెకు పోదామా..

చెరువు గట్టు పిలుస్తోంది,
వాగు , వంక పిలుస్తోంది,
చెట్టూ చేనూ పిలుస్తోంది,
జ్ఞాపకాల దారుల్లో మన చిన్నతనం పిలుస్తోంది
ఊరెళ్ళి పోదామా మన పల్లెటూరు పోదామా....

– మణి మాకవరపు.

## GO GO గొడ్డలి !

ఆకాశానికి అంటుకట్టిన్నట్లున్నా
వంద అడుగుల ఎండిన
చెట్టును చూస్తే కూడ
గొడ్డలికి లేని పదును వస్తుంది
గొడ్రాలు గొడ్డలి !
మనిషి మర చేతిగా
లయ తాండవం చేస్తుంది
మనిషికి వ్యాపార దృష్టి
ఆకు పచ్చదనమెరుగని
కంటికి దోషమే మరి !
ఆగు !అజ్ఞాని గొడ్డలి
శిశిరంలో ఏ చెట్టైనా
చితికినట్లు చితి కట్టెలాగే
అనిపిస్తుంది ప్రకృతి కృతిగా !
వసంతం వస్తే ఆ చెట్టే
నిండా ఆకుల అడవిగా
నల్లమల్ల కోకిల
పాట పాడుతుంది !
ఊ ఊ గొడ్డలి !
నువ్వూ తడి తడికా
చిగురు చిగురౌతావు !



– కందాళై రాఘవాచార్య
9908612007

## మెరుపులు

ఒక్క మనిషికి
ఎన్ని పండుగలు
ఒక మనస్సుకి
ఎన్ని అనుభావాలు

వేడుక లేకుండా
జీవితం లేదు
వివిధత్వం లేకుండా
సౌందర్యం లేదు

పూలది వన
పరిమళం
పుస్తకాలు జీవన
పరిమళం

ఎప్పుడు శిశిరాన్ని
భరించలేం
ఎప్పుడు వసంతాన్ని
ఐనా పరవశించలేం

కోయిల పాట
వసంతం లోనే
నెమలి ఆట
వర్ష ఋతువు లోనే



-చపల మహేందర్
9949864152

## ద్వారబంధం

మాతృ భాష-
ఆయత్న సిద్ధ స్వాస్థ్యం.
అమ్మ గర్భంలోనే తెలుపబడిన
మహా రహస్యం.
రేపటి సంభాషణకు తొలి సంకేతం.

తప్పని ప్రయాణంలో
నీకు నువ్వే భారమౌతున్నప్పుడు
నీ పాదాలు కందకుండా
ప్రేమగా మోస్తున్న
మెత్తని మట్టి పరిమళం!

అనుభవాలతో జీవితాన్ని చెండుకొని
నిండు వ్యక్తిత్వాన్ని నిర్మించుకునే క్రమంలో
నిన్నల్లుకున్న పరిసరమై
పూస్తున్న అక్షర వనం!

కడగళ్ల దారుల్లో గాయపడ్డ ప్రసవానికి
బలహీన పడ్డ బ్రతుకు ఖాళీల నిండా
జీవం నింపే పిప్పళ్ల పాయసం.
జీవన సమరంలో
మూర్ఛపోయిన మనిషిని
మేల్కొలిపే జీవ సంజీవనీ రసం.

పట్నం పోయిన నాన్న
ఏం తెస్తాడో అని ఎదురుచూసే
పల్లె బాల్యానికి...నోటికందించే
తియ్యని మిఠాయి పొట్లం.
పంజరం తలుపు తెరిచి
లోకాన్ని చుట్టే స్వేచ్ఛను ప్రసాదించే
అమృత హస్తం.

నిజానికి..
నన్ను ఇంట్లోంచి ప్రపంచంలోకి
ప్రపంచం లోంచి ఇంట్లోకి దాటించే
ఎలాంటి అంక్షలతలుపులూ లేని
అతి పెద్ద ద్వార బంధం.



-చొక్కాపు.లక్ష్మునాయుడు
9573250528

## ఎందుకు?

ఈ మట్టిలో పుట్టిన
చెట్టు ఆకులం!
ఈ నేలన పారే
నదీ జలాల అలలం!

ఇక్కడ విస్తరించిన
సింధు వందలి బిందువులం!
ఇక్కడ వ్యాపించిన
ఆకాశాన మెరిసే తారకలం!

ఈ దున్నిన పొలాల్లోని
నాగటి చాళ్ళ మట్టి కణాలం!
ఈ గగనాన హాయిగా విహరించే
విహంగాల బారులం!

ఈ కమతాలను చెమట చుక్కలతో
తడిపే కర్షకులం!
ఇక్కడ తూర్పార బట్టిన
కళ్లంలోని ధాన్యపు గింజలం!

ఈ పచ్చని చెట్ల నుంచి వీచే
చల్లని గాలి తరగలం!
ఈవెచ్చని ఎడారుల్లో
పరుచుకున్న ఇసుక రేణువులం!

ఇక్కడి ఉత్పాతాలు.. ఉద్యమాల్లో
పాలు పంచుకున్న భాగస్వాములం!
ఇక్కడి శుభాశుభాల్లో
చెయ్యందించిన సహ వాసులం!

ఇక్కడి శ్రమ సౌందర్యానికి, పౌరుషానికి
నిలువెత్తు ప్రతీకలం!
ఇక్కడ నైపుణ్యాలకి, నాజూకుదనానికి
నిక్కమైన చిరునామాలం!

ఈ దేశ రక్షణలో ప్రాణాలర్పించ
తహతహలాడే సైనికులం!
ఈ భూమి లోతుల్లో తనువుల్ని కలప
తపిస్తూ జీవించే భావుకులం!

ఈ సంస్కృతీ రసధునితో
కలిసి ప్రవహించే ఉపనదులం!
ఈ అసంఖ్య జన ప్రవంతితో
మమేకమై సాగే అల్ప సంఖ్యాకులం!

మమ్మల్నెందుకు విడదీసి చూస్తారు?
మమ్మల్నెందుకు షరతుల్లో బంధిస్తారు?
మమ్మల్నెందుకు భిన్నంగా భావిస్తారు?
మమ్మల్నెందుకు వివక్షకి గురి చేస్తారు?

మత విశ్వాసాలు మనసు పొరలకే పరిమితమని
ఏ నాటికీ గ్రహించరెందుకు?
మతాలు ప్రార్థనా రీతులని
ఏ మలుపులోనూ తెలుసుకోరెందుకు?
ఎందుకు? ఎందుకు?? ఎందుకు???



- ఎస్. కాశింబి
సెల్: 905 2216044

## వెలుగు బాటలు... గ్రంథాలయాలు

సకల శాస్త్రాలకు
సాంకేతిక విజ్ఞానాన్నికి
వెన్నెముకగా నిలుస్తూ
జ్ఞాన సముపార్జనకు
తోడ్పడే ప్రధాన రహదారులు.
విద్య విజ్ఞానానికి
ఆసరాగా నిలుస్తూ
మస్తకాలను కదిలించే
పుస్తకాల పునాదులతో
పరిణతి చెందిన
సమాజాన్ని నిర్మించే
నిర్మాణాలయాలు !
వ్యక్తి శీలసంపదను
సంస్కారాన్ని వ్యక్తిత్వాన్ని
రూపొందిస్తూ
ప్రజలందరికీ సమాన
అవకాశాలను కల్పించే
ఏకైక ప్రవర్తనాలయాలు !
సకల కళలకు
వివిధ శాస్త్రాలకు
సాహిత్య ప్రక్రియలకు
సంబంధించిన గ్రంథాలతో
మెదడుకు మేతపెట్టే
సార్వజనీన శాశ్వత
స్వయం శిక్షణాలయాలు !
పిల్లల కోసం బాలసాహిత్యం
వృద్ధులకు పురాణసాహిత్యం
అందరి కోసం ఆధునిక
సాహిత్యం తో ఊతమిస్తూ ...
ప్రజల జీవన విధానాన్ని
మార్చే ఆదర్శ నిలయాలు !
ప్రముఖుల అనుభవాలు
సుప్రసిద్ధుల జీవిత గమ్యాలు
దేశభక్తుల స్వీయ చరిత్రలతో
జన మేధస్సును
ఒక తాటిపైకి
తెచ్చే చైతన్యాలయాలు !
ఆదర్శవంతమైన సమాజాన్ని
నిర్మించుకునేందుకు
సేవాతత్పరతను
నిలుపుకునేందుకు
విమోచన ఉద్యమం
జాతీయ ఉద్యమం
ఏ ఉద్యమాల కైనా
ఆదర్శంగా నిలిచిన
అధ్యయనాలయాలు !
పాఠకుల మానసిక వికాసానికి
ఉపయోగపడుతూ
ఇష్టా గోష్టిలతో ...
ప్రయోజనకర సదస్సులతో
సమాలోచనలు చేయడానికై
చోటు కల్పించే ఆశ్రమాలయాలు !
మరి . .మరి . .
ఈ కంప్యూటర్ యుగంలో
గ్రంథాలయాలు
కనుమరుగు కాకుండా
అంతర్జాలములో
అంతర్ధానం కాకుండా
గ్రంథాలయాల పరిరక్షణకు కదలాలి
భవితకు మార్గదర్శకులు అవ్వాలి !

-బి రవి చంచల
860330700

## ఎన్నికల పండుగ

పండగ వచ్చింది
ఎన్నికల పండు వెన్నెలను తెచ్చింది
రంగు రంగుల జెండాల రెపరెపలతో
పార్టీల గుర్తుల గుత్తులతో
ఎన్నికల ద్వారాలు వెలిశాయి
పండగ వచ్చింది
మన ఊరికే పండగ వచ్చింది

సమాజ దేవాలయంలోకి
ఓటరు మహాదేవున్ని
వాగ్దానాల మంత్రోచ్చారణలతో
నాయకమన్యులు ప్రస్తుతిస్తూ
ప్రసన్నం చేసుకుంటున్నారు
పండగ వచ్చింది
మన ఓటరుకు పండగ వచ్చింది.

అమాయక ఓటర్‌ను
ఏక్‌దినకా సుల్తాన్ చేసి
ముడుపుల పల్లకిలో కూర్చుండబెట్టి
నాయకులే బోయిలై
బూతుబంగ్లాలో దింపుతున్నారు.
పండగ వచ్చింది
మనవాడ బూతుకు పండగొచ్చింది
చైతన్య రథాలపై ఎక్కి
విజయభేరీలు మ్రోగిస్తూ
విజయశంఖాన్ని పూరిస్తూ
ఉపన్యాసాలతో ఊదరగొడుతున్నారు
నాయకులు ఉగ్రూతలూగుతున్నారు
పండగ వచ్చింది
మన ఊరికి రథాల పండగవచ్చింది.

కిరాయి రౌడీలు గూండాలు
పార్టీల రంగులద్దుకొని
హంతకులు దేవాంతకులు
సాదుసన్యాసుల వేశాలతో
ఊరేగుతున్నారు
పండగ వచ్చింది
మన రౌడీలకు గూండాలకు పండగ వచ్చింది.
ఓటు పండగరోజు కోట్లు కుమ్మరించి
మద్యపానాన్ని ఏరులై పారించి
ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసి
దొంగ ఓట్లతోటి మంత్రిపదవితోటి
అధికార పీఠమెక్కి ఆనందతాండవంతో
పండగ వచ్చింది
మన మంత్రికి పండగవచ్చింది.

ఓటరు మత్తు మెల్లగా దిగిపోతోంది
ఎవరి పనులకు వారు వెళ్ళి పోతున్నారు
ఊరంతా పండుగైపోయి ఎండుగొచ్చింది
మంత్రిగారికారు దూసుకుపోతుంటే
ఓటరు బాబు నోటమాటలే కరువాయె
పండగ వెళ్లిపోయింది
ఎన్నికల పండగ వెళ్ళిపోయింది.



– శిల్పా జగదీష్
సెల్: 9290827384

## దారి దీపం

కులం వర్గం కొండచిలువలై
హృదయాన్ని చుట్టి ఊపిరాడనీయనపుడు
నీ రాతలే కదా!
రాజ్యాంగమై వెన్నెముకలా నిలిచింది.
ఆ శాసనాలే నిచ్చెన మెట్లై
నా ఉనికిని
ఊరి చివర నుంచి
గ్రామపంచాయితీ దాక
పాములన్నింటిని దాటించింది.
అవమానాలు అనుభవించిన చోట
అనచివేతలు చవిచూసిన చోట
ధిక్కార స్వరమై
పునాదులు పెకిలించినా?
వెలుగుల్ని పంచే హక్కుల కోసం
తరతరాలుగా పోరాడుతూనే ఉన్నాం.
మారని తలరాతలకు
మందు వెదుకుతూనే ఉన్నాం.

పరిగిడుతున్న ప్రపంచంలో
మారని మనువాద బుసలు చూసి
మనిషి తనం సిగ్గుపడుతుంది.

బండకైనా చెమట పుడుతుంది కాని
కరుకు గుండెలో ప్రేమపుట్టదు.

వసంత సోయగాలు
ప్రకృతి పంచిన సిరులని తెలువని చోట
అంధకారానిదే పైచేయి
మనిషి కుల మతాల గోడలలో బందీ!

గ్రహణం వీడని బహుజనుల
ప్రాతః స్మరణీయ మంత్రం నువ్వు.

నేనున్నాననే నీ చూపుడు వేలు
నాలుగు కూడల్ల మధ్య దారి దీపం



-దామరకుంట శంకరయ్య
9440876788

## ఆరోగ్యమే మనకు భాగ్యం... !

మన ఆరోగ్య జీవనము
శుచీ శుభ్రతల భూషణము
తర తరాల సత్యమిదే..
నాగరిక మది భావనము!

ఇల్లుచూడు ఇద్దుచూడు
గృహిణివేసె ముగ్గుచూడు
ఇంటికి దీపంఇల్లాలు...
ఇంటి రక్షణ కిలజోడు!

అమ్మచేతిలో ఆరోగ్యము
గోరుముద్దలే భాగ్యము
అమ్మపాలు శిశువుకు భువి
ఆయువు ధీ శుభయోగ్యము!త

అమ్మాయే ఆదివెజ్జువు
పిల్లలకు జ్ఞానఒజ్జవు

శిశువునుండిఎదిగెదాక
ఆమెవడె జీవబిందువు!

అందరికి ప్రాణదాతలు
అభినవవైద్యసుశ్రుతులు
విశ్వ జనజీవనాడికి
అహరహము సేవజ్యోతులు!

అమ్మప్రేమకు కైదండ
వైద్య సేవకు పూదండ
ప్రపంచ ఆరోగ్యదినాన..
మీరే మాఅండదండ...!



–డాక్టర్ గన్నోజు
శ్రీనివాసాచారి
8555899493

## విశ్వాసము

గుండె మడతలో ఒదిగి
ప్రతికదలికలలో కదిలి
పలకరించే తొలకరి

ఆది నుండి మొదలై సమాధి వరకూ తోడై
జీవితానికి వారధియై ముందుకు నడిపించే
సారధి ఈ పెన్నిధి

విశ్వమంతా నడిచే ఈ విశ్వాసము పైనే
జీవ జంతువులు మనుగడ సాగించే
ఆ విశ్వసనీయతతోనే

నీ మనసు పొరలలోని ప్రహరీ ఇది
చెక్కు చెదరని ఆత్మవిశ్వాసం ఇది

మనసుని గెలిచే సాధనం
దేన్నయినా సాధించే సాధకం

ఒకరిపై ఒకరికి వీగిపోని బంధమిది
అదే లేనప్పుడు అంతా అంధకారబంధురమ్మది

ఇంధనంలా నిన్ను ఉరకలెత్తుంచును
బంధనంలా నిన్ను చుట్టిపడేయును

గంధంలా నిన్ను అంటిఉంటే
సింధూరంలా నిన్ను తేజోమయం చేయును
కాటుకలా నిన్ను కాపాడుకొనును

చూరగొనుటే కష్టము
నిలుపుకొనుట అంతకంటే సంక్లిష్టము

ఒడిదుడుకులు ఒడిని చేరిన వేళ
ఒడ్డున చేర్చే ఖరీదులేని పడవే సుమా

కానీ ఇది ప్రవహించే నదిలా రూపుమారుస్తుంటే
ప్రతీ నిముషము అగ్నిపరీక్షే అగును
పగుళ్ళై బీడుగా మారిందంటే ఇక చిగురించదు
చినుకు కురిసినా కూడా

విశ్వాసమన్నది ఆక్షేపణలు కాక
ఆవేదనకు తావులేని ఆక్రోశములేని ఆశ్వాసము
ఆలంబన అవ్వాలి
అపుడే అదిజీవితానికి ఆనందహేతువవుతుంది
చేసుకో మరి సార్థకం
లేకుంటే బ్రతుకు దుర్భరం



-మంజుల సూర్య
9704022244

## మెరుపులు

జగతికి వెలుగిచ్చు
తెలుగుభాష మనది
హృదయంలోకి చొచ్చు
అమ్మభాష మనది !!

మమతల రాగాలు
ఎన్నో పూయిస్తది
తియ్యని స్వరాలు
ఎన్నో పలికిస్తది !!

సంధికి బంధువు
మన తెలుగుభాష
మందికి నిజబంధువు
మన తెలుగుభాష !!

మాతృభాష మన
అమ్మ వంటిది
పరాయిభాష మన
పెంపుడు తల్లివంటిది !!

తియ్యటి పిలుపులతో
అందరిని ఊరడిస్తది
కమ్మని రాగాలతో
అందరిని కవ్విస్తది !!

కన్నతల్లి కన్న
మిన్న ఎవరు
తెలుగుభాష కన్న
గొప్ప దేవరు !!

కవులందరి రాతలచే
వెలిగినట్టి తెలుగు
మహా రాజులందరిచే
మెచ్చబడిన తెలుగు !!

మాతృభాషను మరవడం
మాతను చంపడమే
పరభాషను ప్రేమించడం
పినతల్లిని బ్రతికించడమే !!

మన తెలుగుభాష
జాతికి అదిముద్దు
మన తెలుగుభాష
ప్రజలకు ఎంతోముద్దు !!

అనర్గలమైన తెలుగు
ఆనందాన్ని ఇచ్చు
మంచిమాటల తెలుగు
జనులందరు మెచ్చు !!



-తాండ్ర చిరంజీవి
9959180762.

## దిశా నిర్దేశం

ఆకసాన పక్షులు
ఆడవారి తలపులు
ఆశలకు ఆనాడే
మూసుకున్న తలుపులు

ఆదర్శ మహిళలు
వీర సాధ్వీమణులు
ఇచ్చినారు పిలుపులు
మహామహానుభావులు

వినివారి మాటలు
ఎందరో అబలలు
మారిరిగా సబలలు
సహిస్తూ గాయాలు

ఆనాడు మొదలు
వంటింటి కుందేలు
పడకుండా కుదేలు
వడివడిగా పాదాలు

పట్టి ప్రగతి దారులు
చెమర్చిన కనులు
తిరుగుతున్నా సుడులు
ప్రతికూల పరిస్థితులు

ప్రాణంతీసే గాయాలు
హృదయవిదారక గేయాలు
సమస్యల సుడిగుండాలు
విపత్తుల వలయాలు

మరువక మగువలు
సంస్కృతీ సంప్రదాయాలు
ప్రదర్శిస్తూ ప్రతిభా-పాటవాలు
తిరుగుతున్నా మలుపులు

కొనసాగిస్తూనే సేవలు
సాధించారెన్నో గెలుపులు
నింగిలోన తారలు
మన తరుణీమణులు

ఆబగా పురు(ష)గులు
గుచ్చుతారు చూపులు
చూసుకుని వీలు
పైబడే నీచులు

కంటపడితే మృగాలు
కాకు నిర్భయ...ప్రియాంకలు
పైబడే నీచులు
ఒలిచెయ్ వాళ్ళ తోలు

వస్తూనే "ఆ"ఆలోచనలు
గుర్తురావాలి ఆదిశక్తులు
దులుపుకుని చెదలు
సరిదిద్దుకుంటే మెదళ్ళు

ఆప్యాయత నిండిన కళ్ళు
అమ్మ తనపు లోగిళ్ళు
ప్రేమ ప్రవాహపు వరవళ్ళు
పెకిలించి పాపపు వేళ్ళు

తుడుచుకుని కుళ్ళు
'ఆమె'కు నమస్కరించి వెళ్ళు
ఆనందపు సెలయేళ్ళు
ఆమె జీవితాన తుళ్ళు .

-శ్రీమతి తురుమెళ్ళకళ్యాణి

## బంధాల భవంతి

ఎత్తైన భవనం అందమైనది విశాలమైనది
అద్దాల కిటికీలు
నాట్య మయూరి నాట్యం చేస్తున్నట్లు
డిజైన్ చేసిన తలుపులు
ముఖ వర్చసు కనిపించే పాల రాతి బండలు
స్వర్గానికి దర్శనమిస్తున్న ట్లుగా ఉన్నా
పూజామందిరము మనస్సుకు
ప్రశాంతత కలిగించే గోడల రంగులు
మక్ మల్ సోఫాలు
అద్దాల టేబుల్ జోలపాడుతూ నిద్రపోయేందుకు ఉయ్యాలలు
ఇంటి చుట్టూ రంగురంగుల పూల చెట్లు
ఆకుపచ్చని గడ్డితో తోట కళకళలాడుతుంది
ముచ్చట గొలిపే గులాబీలు
సువాసన వెదజల్లే మల్లెలు
ముద్దమందారాలతో తోట
యిల్లు ఇంద్ర భవనంలా ఉంది.
కానీఆ ఇంట్లో ఆప్యాయతల కరువు
మనిషికి మనిషే బరువు
ఎవరికి వారే యమునా తీరు
అలాంటి యిల్లు ఇంద్రభవనం అయిన
నరకంతో సమానమే



-అనిత దావత్
9394221927

